# బాపురెడ్డి పద్యకావ్యాలు

జె. బాపురెడ్డి

894.8271
BAP

...షేలా ప్రచురణ
హైదరాబాదు

C·I

ADWA1017B LW+

బాపురెడ్డి

# పద్యకావ్యాలు

MEMORIAL LIBRARY
V.R.NARLA
D.P.R.I.
Acc. No.
10867
V.R.NARLA

జె. బాపురెడ్డి

DR. B.R AMBEDKAR OPEN UNIVERSITY
UNIVERSITY - LIBRARY
N10867

సుఖేలా ప్రచురణ

హైద్రాబాదు

A

894.827
BAP

మొదటి ముద్రణ

**1969**

ముద్రణం :

లలితా ప్రెస్

హైదరాబాదు-4.

MEMORIAL
V. R. NARLA
R. P. L.
ACC. NO.

వెల : **3/—**

హక్కులు రచయితవి

సుఖేలా నికేతన్

I. C. 85, ఇర్రం మంజిల్ కాలనీ,

హైదరాబాదు-4.

B

V. R. NARLA MEMORIAL LIBRARY
V.R NARLA
D. P. R. I.
Acc. No.

# విషయానుక్రమణిక

(I) కావ్యప్రశస్తి

(II) పుట్టుపూర్వోత్తరాలు

(III) కృష్ణమాచార్యునికి

| | | పుట. |
|---|---|---|
| 1. | కవితాప్రస్థానము | 1 |
| 2. | స్వప్నజగత్తు | 4 |
| 3. | అద్వైతము | 8 |

I

| | | |
|---|---|---|
| 4. | అనుతాపము | 11 |
| 5. | కృతఘ్నత | 15 |
| 6. | పరీక్ష | 19 |
| 7. | రసరాగము | 21 |
| 8. | ఆనందయోగి | 23 |
| 9. | అనింద్య | 26 |
| 10. | సుప్రభాతము | 29 |
| 11. | మనశ్శాంతి | 32 |
| 12. | సరససాగరుడు | 33 |
| 13. | రవీంద్రకవీంద్రుడు | 35 |
| 14. | స్నేహసౌరభము | 40 |
| 15. | నెదరులాండు | 43 |
| 16. | నెహ్రూజీ | 48 |
| 17. | మృత్యువు | 50 |
| 18. | యౌవనవీణ | 54 |
| 19. | మహోదయము | 56 |
| 20. | ఇతికర్తవ్యము | 58 |
| 21. | సుభాసువాణి | 61 |
| 22. | నివేదన | 66 |
| 23. | చంద్రవిజయము | 69 |
| 24. | కళాతృష్ణ | 72 |

# కావ్య ప్రశస్తి

శ్రీ బాపురెడ్డిగారిదివఱకు ప్రశస్తములైన గేయకావ్య సంపుటములు మూఁడు నాలుగు ప్రచురించి యాంధ్ర సహృదయుల మన్నన లందుకొని యున్నారు. రసజ్ఞ రంజకమైన భావుకత, ఉదాత్తమైన భావ సంపద, సరసమంజులమైన శైలి పరిపాకము, అవిచ్ఛిన్నమైన అభ్యాసము పుష్కలముగాఁగల యువకవిపుంగవులు వారు. ఔద్యోగిక కార్యభారవ్యగ్రులయ్యును వారెట్లో వీలు చిక్కించుకొని కవితావ్యవసాయమునకుఁ గడంగుచుండుట వారి రసప్రసవోద్యాన వాటికా విహార పరాయణతకుఁ దార్కాణము. అసలానందమందిరమైన వారి యాకృతి విశేషముననే కవితనము కదలాడుచున్నట్లుండును. గేయకవితా విలాసినీ వశంవద మైన హృదయము నిప్పుడు పద్యకవితా కాంతపైకి మరలించుట వయోనుగుణమైన వారి ప్రౌఢతాప్రియంభావుకతను చెప్పక చెప్పుచున్నది. ఛందోవిన్యాసమున కించిద్విశేషమున్నను పద్యగేయములు రెండును కవితాహృదయ వ్యక్తీకరణమున సమాన సామర్థ్యము కలిగినట్టివే. ఈ పద్య కావ్యాల ప్రకటనము శ్రీ బాపురెడ్డిగారి కారెండింటఁగల సవ్యసాచిత్వమును వ్యక్తముచేయుచున్నది.

ఈ సంపుటమున సుమారిరువదియైదు ఖండకావ్యములున్నవి. వీనిలోఁ బెక్కాత్మాశ్రయ భావ సంభృతములై భావకవితా పద్ధతికిఁ జెంది యున్నవి; కొన్ని యాధునిక కాలపు విజ్ఞాన శాస్త్రాభ్యుదయమునకు సంబంధించియున్నవి; కొన్ని యాంధ్రరాష్ట్రావిర్భావమును బ్రకృతిని వర్ణించుచున్నవి; కొన్ని కవిగారికి సాగరము, రవీంద్రుఁడు, మృత్యువు మున్నగు విషయములపైఁగల భావములను వ్యక్తీకరించు చున్నవి. ఈ విధముగా నీ సంపుటము కవిగారి కవితాభావ వైవిధ్య సంపదను వెల్లడించుచుఁ బఠితల కానందమును గలిగించుచున్నది.

కవితా ప్రస్థాన మను ఖండకావ్యమున శ్రీబాపురెడ్డిగారి కాదర్శములైన కవితాశయములు వ్యక్తీకరింపఁబడినవి. నిత్య నూతనత వారి ప్రత్యేకత; నిసర్గస్వాదు సౌందర్యభావ ప్రక్షేపము వారి విలాసము; నక్షత్రాలే వారి కావ్యములు. కవితా ప్రపంచమున గణ యతి ప్రాసాదులు, ఉదాత్తములైన భావములు. రమణీయమైన శైలి కావలసినట్లే, వారికి బాహ్య ప్రపంచమున సూర్య తారకాదులు, గ్రహోపగ్రహములు, శాస్త్ర విజ్ఞాన శాస్త్రములు, దౌత్యాశయ దివ్యదిగ్విజయములు కూడఁగావలయును. ప్రయోగముతోపాటు యోగమును గూడ నుజ్జగింప కుండుట వారి కిహపరములు రెండింటఁగల పరాయణతను ప్రకటించుచున్నది అందు చేతనే వారు బాహ్యములైన చర్మ చక్షువులను అంతరములైన 'లోకన్నులను' గూడ జగద్దర్శనార్థమై వినియోగించుట కువ్విళులూరుచుందురు. సుఖదుఃఖమిశ్రితమైన జగమ్మున కవికి వర్జనీయమైన దేదియు నుండదు. ప్రేయసి హాసముతో వలెనే నిరుపేదల వేదనల తోడను అతనికి సంబంధము కలదు. ఈ సంబంధము లేనిచోఁగవిత సాక్షికమై జగత్ప్రతిబింబమును, నవరసరుచిరమును గాఁజాలదు. శ్రీ బాపురెడ్డిగారద్వైత మను ఖండకావ్యమునందలి

ప్రాయఁగనె విలాసినులపై గేయములను
కూలిపిల్లను మఱచు మూర్ఖుఁడనుగాను
ప్రకృతి సౌందర్యమును గూర్చి పాడఁగానె
మానవుని కష్టసుఖములే మఱవలేను.

అను పద్యమున నీ భావమునే వెల్లడి చేసియున్నారు. కవితా ప్రపంచమున 'కష్ట సుఖములు రెంట భాగమ్ముగొంట' సంపూర్ణతా లక్షణము; అభ్యుదయ భావ సంపదకు సూచన.

మానవుఁడు 'పుట్టి స్వప్నశింబములనుండి స్వప్న గోళముల చుట్టు భ్రమణ మొనరించుచు స్వప్నభవనములందు వాసమొనరించి స్వప్న విశ్వములు చేర' ప్రయాణము సాగించుచుండునని శ్రీ రెడ్డిగారి భావము. వర్తమానము గతము కన్న స్వప్నమేయనియు, భవిష్యత్తు వర్తమానపు మూగ

కనుల నిగూఢముగఁదోఁచు వెలుఁగు రేఖ యనియు ననుకొనుటలో నసత్యము లేదు. నిదురలోఁగల మానవుని యెదను మేలుకొలుపునని కవిగారి భావము. ఆపదలందు సంపద్రేఖ స్వప్నముగా గోచరించి మానవునోదార్చును. కవి, వైజ్ఞానికుఁడు, శ్రామికుఁడు, విరహి మున్నగు వారందఱును స్వప్నసరస్సులలో దేలిపోవుచుందురు. వారొకప్పుడు కన్న కలలే నిక్కలలై వారికానందము కలిగించును. అందుచేతనే శ్రీ రెడ్డిగారు

నరునికిల స్వప్నమే చేతనా రథమ్ము
కలల అలల జీవనకథ యిలచరిత్ర

అని గొంతెత్తి ఘోషించినారు. వారి కల భ్రాంతిమయము కాదు, భవిష్యదభ్యుదయ సంపత్సూచకమైన నిత్య సత్యము.

స్వప్నము సత్యమైనప్పు డెంత యానందము కలిగించునో యసత్యమైనప్పుడంత నిరుత్సాహము నావహించును. అందుకు స్వప్నానుభూతి వలనఁ గలిగిన యాశ కారణము. అందుచే నాశ పెంపొందించుకొనుటకు ముందు లక్ష్యములైన వస్తువుల బహిరంతరములను సూక్ష్మేక్షికతోఁ బరిశీలింపవలయును. ఈ పరిశీలనము లేనిచో మోసము తప్పదు "ఈపూ లతల మాటునే విషసర్పాలుపొంచియుండుట నేగ్రహియింపనైతి"నాదేహముగేహమున్ మఱచి దివ్య పథమ్ముల స్వప్న చంచలావాహన మెక్కుఁ-టేల భువి వ్రాలిపడం బరితాపమేలకో" యను కవిగారి వాక్యము లాపరిశీలనము యొక్క యావశ్యకతను నొక్కి చెప్పుచున్నవి. అలభ్యములైన యాశలు పెంచుకొని యనుతాపమందుటకంటె తృప్తి వహించి 'విశ్వమెల్ల ప్రేమించి జీవించనేర్చి' "వాస్తవజ్ఞాన పథమున నడచుటొకటె" సౌఖ్యకరమని వారు కావించుకొన్న నిశ్చయము.

స్వచ్ఛ ప్రేమ రూపమైన స్నేహమునకును మోహమునకును విశేషమైన యంతరమున్నది. 'మోహము లేని స్వచ్ఛతమమోదము కూర్చు నిసర్గ రంజకస్నేహముమించుభాగ్యనిధి సృష్టినిలేదని' కవిగారియాశయము. స్నేహబంధమునకు 'లౌకిక స్వార్థచింతనానేక బాహ్యబంధ' ము లుండరాదనియు ప్రేమ యమరమై శాశ్వతమై యలరారుననియు వారి విశ్వాసము. పరీక్షయను

ఖండకావ్యమున వారు ప్రేమించుట కచ్ఛమైన మానవత్వమువలె మోహజనక మైన బాహ్య సౌందర్యము కారణముకాదని వ్రాక్రుచ్చినారు. 'అట్టి కన్యపై ఇచ్ఛయు లేదు చల్లగ చలించెడి మానవతా లతాంకమున్ విచ్చుచు నున్న నిన్నెదజపింతు వరింతు మనుష్య భామినీ' యని వారు ప్రకటించుట యిందుకు నిదర్శనము. తళతళలాడు చూపులు, మధురమైన కంఠస్వరము మున్నగు దైహిక సౌందర్య చిహ్నములు 'వాక్కులకందరాని భగవంతుని సృష్టికె మూలమౌ ఏదో చక్కదనమ్ము' వలపునకు హేతువై యుండవలెనని చెప్పుట వారి ప్రేమ దివ్యత్వమును జెప్పక చెప్పుచున్నది. స్వచ్ఛప్రణయ మహిమ యెన్ని విఘ్నములనైనను, గండములనైనను, దొలగించును. కొఱగాని లోకమున నడుగడుగునఁగనవచ్చు క్షణిక సుఖములపై భ్రాంతి వీడి యాంతర మైన దివ్యకాంతి సంపదను గాంచుమ రసలోక తపస్వివై కాలము పుచ్చవలె నని వారి యాదర్శము. 'ఈవాసంత వసంతికారవములున్...దేవీ జీవకళా విలాసములలో దీపింపలేనప్డు నిర్జీవమై చనుగాన ఈ ప్రకృతిలో జీవింతు దేవీ హృదిన్' అని వారు వాంఛించుట కీయాదర్శమే మూలము. ఇట్టి యాధ్యాత్మిక వాసన బలవత్తరముగా హృదయమునావరించియుండుటచేతనే వారు "నివేదనలో"

> నా క్షుభితమైన మేధకు
> ఏక్షణమున శాంతిలేదు ఈ చీకటిలో
> చక్షువు నాకీవే పరి
> రక్షణ మీవేను చూపరా వెల్గు! ప్రభూ!

అని పరమేశ్వరుని వినయముతో ప్రార్థించినారు.

వస్తువులపై స్వామ్యమెవ్వరికున్నను వానియందుఁగల సౌందర్యము సర్వసాధారణమనియు దానిననుభవించుట కెల్లరి కధికారము కలదనియు కవి గారి భావము. 'పూవుల అందమందరిది పూచిన తీవ ఎవళ్ళదైన, సద్భావ రసమ్ము అందరిది భావుకు'దేగృహవాసియైన' నని వారు చెప్పుట యిందుకు నిదర్శనము. కళావిభవానుభవ మందఱికి జూఱ యిచ్చుటకై స్వామ్యసంబంధ మైన స్వార్థమును వర్జింపవలెనని వారి యుపదేశము. 'అందము అందమే

మనకు అందిన అందక పోయినన్ మనఃస్పందన వేరు తార్కిక వివాదము వేఁరని చెప్పుట వారికి సౌందర్య దిదృక్షయందుఁగల యుత్కంఠను వ్యక్తము చేయుచున్నది. మానవుఁడు చంద్రగోళముపై నడుగుపెట్టిన పిమ్మట నచ్చట రాలునురప్పలును కొండబనుగోతులును తప్పమఱేవియు లేవనితెలియవచ్చినది. ఇదంతయు సత్యమేయైనను 'రేల నభోంతరాల శశిరేఖలఁ జూచి చలింప కుందుమా' యనియు శరీరము చర్మ రక్తాస్థిమాంసములకూడికయని తెలిసియు 'రమణులఁజూచినప్పుడు సరాగపరాగము పొంగులెత్తదా' యనియుఁ గవిగారు ప్రశ్నించుచున్నారు. 'పడగెత్తిన ధీబలశక్తి ముందింద్రియానుభూతిం దిర పేదవోదు'. అందుకుఁగళాతృష్ణ కారణము. విజ్ఞాన శాస్త్ర విజృంభణము కళలకును గవనమ్మునకు విఘ్నమాపాదింపఁ జాలదనియుఁ గళాతృష్ణ జాబిలి వలె శాశ్వతమనియు శ్రీ రెడ్డిగారు చెప్పుచున్నారు.

మానవత్వము హృదయ సంపన్నిర్ణేయముకాని యాకృతిమాత్ర నిర్ణేయము కాదు. ప్రకృతి దేవియే మానవునకు విశ్వరహస్యములన్నియు విప్పి చెప్పి యాతని బలవంతునొనర్చెను. స్వార్థద్రోహ చింతాపరాయణుండై యాతఁడామెనే వికృతను గావించి కృతఘ్నత ప్రకటించినాఁడు. దీనిని గర్హించుచుఁగవిగారు మానవుఁడు తాను వానరుండుకాని దానవుఁడుకాని కాఁడనియు మానవుఁడనెడి కీర్తిని సంపాదింప యత్నింపవలెననియు నుపదేశమిచ్చుచున్నారు. మానవుఁడు 'స్వార్థతాసురాపాన మదాంధుఁడై తన ప్రపంచములో విలయాగ్ని రేపఁగా పూనెడి కుట్రలందెలిసి' భూజనయిత్రి మనమ్ము విదల్చికొని యేడ్చుచున్నదని వారతని ఘోరకృతఘ్నతకు ఫలముగానేర్పడిన వికృత దృశ్యమును బట్టబయలు చేయుచున్నారు. మానవుఁడు యంత్రముల మాయ లోఁపడి మానవులనే వేటాడమరగినాఁడనియు, హంతయైన యాతనిఁజూచి శాంతిదేవి బెదరి యడవులకుఁ బాఱిపోవుచున్నదనియు వారు చెప్పినది సత్యము. 'దుర్మార్గమున్ వీడి ఉజ్జ్వల సౌభ్రాత్రము సౌమ్యమున్ వెలుఁగ విశ్వమ్మంతటన్ పంచి శాంతిలతల్ పెంచుము ప్రేమ జీవనములన్ దీవించు నిన్ సృష్టియున్' అని వారు కావించిన మహోపదేశము మానవులందఱును స్మరింపఁ దగినట్టిది. మనుజుఁడు చంద్రలోకమున నడుగుపెట్టఁజాలుటచే 'భూమాతయు

చంద్రి మాతయు' కలిసెనని వారెంత సంతోషించుచున్నారో మానవుఁడు స్వార్థలోభాలకుఁ జిక్కి తన లోకమైన భూలోక కీర్తి సాధనకు సర్వలోకాల శాంతి సుఖము చెరగొనునేమో యని యంత భీతి నందుచున్నారు.

వసంతోదయమను ఖండకావ్యము కవిగారి ప్రకృతి పరిశీలనమును వర్ణనపాటవమును వ్యక్తము చేయుచున్నది. వాసంత వాతావరణమున వియోగ బాధ హెచ్చుఁగా నొక దేవి మోవి వారినొక భావకవిని జేసినది. శిశిరానంత రము వచ్చిన వసంతమును సూచించుటకు వారు వాడిన యుపమానములు రెండును అద్భుతముగా నున్నవి. శిశిర దుశ్శాసనుఁడు పసుపు చేలములు తొలఁగింపగానే వనకుమారి పచ్చపచ్చని క్రొవ్వలిపములు దాల్చి వసంతాకృతి దాల్చినది, ఏమురారియో యామె మొరాలించియుండునని వారి భావన. శిశిర మందలి హిమశిలలు వాసంత కోష్ణ నిశ్శ్వాసములచే కరఁగి ఝురులుగాఁబాఱుట వారికి 'విప్లవోషస్వినీకాంతి వీక్షణాలకరగి' దాస్యాంధకారము పాఱుటవలె గోచరించినది. కవి శిశిరమున జీర్ణ లోకము చూడలేక యేడ్చియు, వసంతమున నుప్పొంగి శుభగీతి పాడియుఁ బ్రకృతి తాదాత్మ్యమును సాధర్మ్యమును బ్రకటించునని కవిగారి యభిప్రాయము.

మహోదయము, సుప్రభాతము అను ఖండకావ్యములు ఆంధ్రప్రదేశ్, విశాలాంధ్రావతరణ సందర్భములందు రచింపఁబడినట్టివి. ఎన్ని వసంతములు గడచినను. ఎన్ని ఉగాదులు వచ్చిపోయినను కలుగని యనిర్వాచ్యమైన యను భూతి కవి గారి కాంధ్ర రాష్ట్రావతరణమునఁ గలిగి యుండుట వారియందలి యుత్కటమైన యాంధ్రాభిమానమునకు నిదర్శనము.

గున్నమామిడి తన ప్రియ కోకిలమ్మ
వీడిపోయి యానాఁడు తపించి తిరిగి
నవ్యముగ నేడు కూడి గానమ్ముచేయు
నాంధ్ర తెలగాణ మేకమైనట్టి తమిని.

అనివారు విశాలాంధ్రప్రాదుర్భావమును బ్రశంసించినారు. ఆయుత్సాహానందము లచే వారికి దుర్ముఖియు సుముఖిగానే కనిపించెను. 'శక్తి గర్భానపడు చిన్కు

ముక్తకాదె' యని వారిచ్చట వాడిన యర్థాంతరన్యాసము రమణీయముగా నున్నది. 'ఎదలోని కల్మషము నీటను దోసి మనోజ్ఞ దివ్యశోభాయుతమైన దివ్యసుమ వాటిని నాటు' మని వారొసంగిన సందేశ మాంధ్రులెల్లరును ఎల్లపుడును స్మరించి యనుసరింపఁ దగినట్టిది.

కవిగారు తాము నెదరులాండులోగాంచిన విశేషములను సుస్పష్టరేఖలతో విశదముగా వర్ణించియున్నారు. ఇది వారి నిశిత పరిశీలనకును. సౌందర్య దిదృక్షకును, వర్ణనా చాతుర్యమునకును తార్కాణముగా నున్నది. అచ్చటి దృశ్యములు 'వింతలకే గిలిగింతలు' కలిగించునని చదివినప్పుడు పాఠకులెల్లరును నెదురులాండున కేగుటకై యువ్విళులూరక మానరు. 'సరససాగరుడు' కవిగారి భావగాంభీర్యమునకును, భావనా పాటవమునకు దృష్టాంతముగా నున్నది. సాగరుని సరసత్వమును వారు చక్కఁగా వర్ణించినారు. సముద్రము సౌందర్యానందములకు 'శరధి'.

పులకరించితివేని సజ్జలకణములు
ముక్తిహొంది యైపోవును మౌక్తికములు
రక్తిచెందెదవేని చిరత్నశిలలు
ధన్యతను జెంది కావె రత్నాల జాలు

అను పద్యము చిన్నదయ్యును మార్దవ గాంభీర్యముల నొక్కచో ముడిపెట్టుచున్నది. మృత్యువును సంబోధించుచు వారు వ్రాసిన పద్యములు సహజములును భావప్రేరకములునై మృత్యువు స్వభావమును చక్కఁగా వ్యక్తము చేయుచున్నవి. 'చావు లేదేలనే మృత్యుదేవి నీకు' అని వారడుగుట ఆమె కరాళ దంష్ట్రలఁ జిక్కిఁ మాయమైన జీవకోటులపై వారికిఁగల సానుభూతిని జాలిని శక్తిమంతముగా వెల్లడించుచున్నది. నిజముగా మృత్యుభయమే లేనిచో గర్వలోభావృతుఁడైన మానవుఁడీ జగమ్మున నెన్నెన్ని హిరోషమాలు నరకమ్ముల్నించునో' యని వారు సందేహించుట మృత్యువు కంటెను క్రూరతరుఁడైన మానవుని దుస్స్వభావమును జెప్పక చెప్పుచున్నది.

నెహ్రూ, సుభాసు, రవీంద్రులను గూర్చి కవిగారు రచించిన ఖండకావ్యములు వారి దేశభక్తిని దేశనాయక మహాకవి భక్తిని ప్రకటించుచున్నవి.

ఆ మహనీయుల యందుఁగల మహాగుణ సంపద నీ కావ్యములలో వారు చక్కగా నిరూపించినారు. 'తాను భారతదేశముగాను భరత దేశమే తానుగాను' వర్ధిల్లిపోయిన దేశభక్తాగ్రగణ్యుఁడు నెహ్రూజీ. 'సుభాసువాణి' నుత్తమ పురుషమున జెప్పుట రమణీయముగా నున్నది. 'బ్రతికి చచ్చిన వీర సుభాసు నేను, చచ్చి బ్రతికిన జీవనాశయమ నేను' అని యతఁడనుట యాత్మశ్లాఘ కాదు. పరమసత్య శోభితము.

మనుషులు మహాత్ము లెందరు మరుగుపడిన
మరుగు పడరాదు స్వాతంత్ర్య తరణి దీప్తి
చితికి పోరాదు ఏపరిస్థితులనైన
మీ మనోగతమానవతా మతల్లి

యని కవిగారు సుభాసు నోటఁబలికించిన సందేశము భారతీయులందఱికిని శిరోధార్యమైనట్టిది. రవీంద్రుఁడు 'దుర్భర దాస్య విశీర్ణ సాహితీ ప్రాంగణమందు' విలసద్రస పారిజాతములు నాటఁజాలిన మహాకవీంద్రుఁడు. అతఁడు గురువునొద్ద నధ్యయనము గావింపకయే, బడికేగకయే, ధాతృవిరచిత ప్రకృతి పుస్తకమును మాత్రము పట్టి కవీంద్రుఁడై ఖండాంతరముల భారత ఖండమున కఖండకీర్తి గడించి పెట్టిన మహనీయుఁడు.

ఈ ఖండ కావ్యములలో నెడనెడ శ్రీ బాపురెడ్డిగారు వెల్లడించిన భావములు గంభీరములై పూర్వ మహాకవుల భావములను స్మృతికిఁదార్చుచున్నవి. స్నేహ సౌరభమునందలి:

ఒకరిని చూడగానే యెదియో అనురాగము
మోసులెత్తు, వేరొకరిని చూచి చూడగనె
ఓర్వమి ద్వేషము పొంగులెత్తు. దేనికిఁగల
కారణమ్ము రమణీ కనరాదు, వితర్క
హేతువాదికి మరి జన్మజన్మలకు తీరని
వాసన లుండకుండునా?

యను పద్యము జగత్ప్రసిద్ధమైన కాళిదాసుని 'రమ్యాణి వీక్ష్య మధురాంశ్చ నిశమ్య శబ్దాన్......భావ స్థిరాణి జననాంతర సౌహృదాని' యను శ్లోకమును తలంపునకుఁ దెచ్చుచున్నది. నివేదనయందలి

తెలిమబ్బుల మైదాన
మ్ముల జాబిలి బంతి యాడఁబోయి నిరాశన్
జలధి హృదంతరమౌక్తిక
ముల రత్నము లేరుకొనఁగ ముచ్చట పడుచున్

అను పద్యము పదముల కూర్పు చేతను. భావ వ్యక్తీకరణము చేతను, అలంకార సంఘటనము చేతను గడుంగడు రమ్యమై పాఠకుల నాలోచనాబ్ధి తరంగముల నుయ్యాలలూపుచున్నది. మృత్యువు నందలి

ఇల పూచినట్టి జీవులు రాలి నీ కంఠ
హారమ్ముఁ జేర నున్నట్టి పూలె

ఇత్యాదిగాఁగల సీసము సుందరమైన నడకయు చక్కని భావ వ్యక్తియుఁగల్గి యింపు నింపుచున్నది.

శ్రీ బాపురెడ్డిగారి రచన సర్వత్ర వారి హృదయమువలెనే ప్రసన్నమై, మధురమై చదివిన కొలంది చదువవలెనను నుత్కంఠను రేకెత్తించుచున్నది. పద్యములన్నియు ధారాశుద్ధి శోభితములును, భావ గంభీరములునై మకరంద ప్రవాహమువలె సాగిపోవుచున్నవి. ప్రసాద గుణము వారి కవితకు జీవగఱ్ఱ. వారు వాడిన పదములు కుసుమములవలె రసప్రసారకములు. కిసలయములవలె మసృణములునై రచనకసమానమైన రామణీయకమును గూర్చుచున్నవి. విహారించు పుట (10) మున్నగు నపూర్వ ప్రయోగము లెడనెడఁ గనవచ్చుచున్నవి. వారు పద్యములలో విసంధి చేసి వ్రాసినవఖ్ఖు కొన్ని సంధి చేసినచో గణభంగమునకుఁ దావిచ్చును. అట్టి వానిని వారు పరిహరించి యుండవలసినది. శంకత్వము (57) శ్రేయోవిర్భవము (34) స్వార్థాసురకు (10) మున్నగు ప్రయోగములను మలి ముద్రణమున సులభముగా దిద్దుకొనవచ్చును.

శ్రీ బాపురెడ్డిగారు ఈ సంపుటమున సాధారణ వృత్తములతోపాటు "పిన్నలు, పెద్దలు, కన్నెలు, ప్రౌఢలు భేదము లెంచక వీధులలో" (45) (24) పాదు పందిరేని లేక పారు తీవలట్టులన్ (42) మున్నగు క్రొత్త వృత్తములను, రవీంద్రుడను ఖండకావ్యమున ముత్యాల సరముఁను వాడియున్నారు. [illegible]రే వృత్తముల నెన్నుకొన్నను వానిని గుంటువడనీక ధారాళముగా నడపించినారు. నివేదన యందలి కందములయు నచ్చటచ్చట గల సీసములయు నడక రమ్యముగా నున్నది. శ్రీ బాపురెడ్డిగా రింతదనుక ఖండకావ్యములనే ప్రతిభా మహితముగ రచించి ప్రకటించి యుండిరి. వారి రచన ప్రౌఢ సుందరమును, రస రమణీయమునై వస్తుకావ్య రచనానుకూల్యమును గడించుకొన్నది. తదనుగుణముగ వారింక ప్రౌఢకావ్య రచన కుపక్రమించి యాంధ్రభాషాయోష కభినవాలంకృతులు సమకూర్తురనియు, నట్టి యవకాశము భగవంతుఁడు వారి కొసంగుననియుఁ గోరుచు విరమించుచున్నాను.

21—12—1969 దివాకర్ల వేంకటావధాని

పుస్తకం—

# పుట్టుపూర్వోత్తరాలు

నా రచనలలో ఈ "పద్యకావ్యాలు" సంఖ్యాక్రమంలో నాలుగవ ప్రచురణ. ప్రక్రియా క్రమంలో రెండవ ప్రచురణ. ఇంతవరకు ప్రచురించినవి "చైతన్యరేఖలు," "రాకెట్టు రాయబారం," "బాపురెడ్డి గేయాలు." మొదటి రెండు కావ్యసంపుటాలలో వివిధ ప్రక్రియాగతమైన కవితలు చేర్చబడ్డాయి. పోతే "బాపురెడ్డి గేయాలు" కేవలం గేయ కావ్యాల సంపుటి.

నేటి కవితాసృష్టి స్వరూపదృష్టితో కావ్యాలు నాలుగు ప్రక్రియలుగా విభజించటానికి వీలుంది. గేయాలు, గేయ నాటికలు. గద్యాలు, పద్యాలు. నేనింతవరకు వ్రాసిన కావ్యాలు ఈ నాలుగు ప్రక్రియలకు చెందినవి కాబట్టి మిశ్రమ ఖండకావ్య సంపుటాలుగా కాక, ఒక్కొక్క ప్రక్రియకు చెందిన కావ్యాలను ఒక్కొక్క సంపుటిగా ప్రచురించాలని నిశ్చయించుకున్నాను. ఉత్తరోత్తర వ్రాసే ఆయా ప్రక్రియకు చెందిన కావ్యాలను తిరిగి ఆ యా కవితా సంపుటం పునర్ముద్రణ జరిగినప్పుడు (పాఠకుల ఆదరణ ఉంటే) అందులో చేరుస్తూఉంటాను. అంటే స్వతంత్ర కథాకావ్యాలు మినహాయిస్తే, నేను జీవితాంతం వ్రాసే కావ్య ఖండికలన్నీ నాలుగు సంపుటాలుగా మాత్రమే ప్రవర్ధితం కావాలని కోరుకుంటున్నాను.

ఇలా ప్రక్రియా ప్రాతిపదిక మీద ప్రచురించిన మొదటి గ్రంథం "బాపురెడ్డి గేయాలు" అందులో మాత్రాఛందోబంధురాలై గానయోగ్యంగా ఉండే గేయాలను మాత్రమే చేర్చడం జరిగింది. ఇంతవరకు ఆ పుస్తకం గురించి వచ్చిన సమీక్షలు, సహృదయుల అభినందనలు నా పథకానికి ఎంతో ప్రోత్సాహాన్ని ఇచ్చినవి. "బాపురెడ్డి పద్యకావ్యాలు" ఆ వరుసలో రెండవ గ్రంథం. సౌహార్ద సంపత్తి, రసజ్ఞుల సమాదరణ లభిస్తే త్వరలో మిగతా రెండు సంపుటాలు "గేయనాటికలు," "గద్యకావ్యాలు" కూడా

ప్రచురించాలని ఉత్సాహపడుతున్నాను. నా మిశ్రమ కావ్య సంపుటాల నుంచి ఆయా ప్రక్రియకు చెందిన కావ్యాలను సాధ్యమైనంతవరకు విడదీసి ఆ యా ప్రత్యేక ప్రక్రియా సంపుటిలో నూతన రచనలతోపాటు చేర్చడం జరుగుతుంది.

ఈ సంపుటిలోని కావ్య ఖండికలు గడిచిన పది సంవత్సరాలలో, విభిన్న సందర్భాలలో వివిధ మనః ప్రవృత్తులలో వ్రాసినవి. అందుచేత శైలిలో ఇతివృత్తాలలో వైవిధ్యం కనిపిస్తుంది. సౌందర్యారాధన, విశ్వజనీనత, సర్వ మానవ సౌభ్రాత్రము అంత స్సూత్రంగా అల్లుకొన్న నా భావపుష్పమాలలు. ఈ కావ్యఖండికలు. నింగినీ నేలనూ కలపడానికి నేను నిర్విరామంగా నిర్మించిన రసరాగ సోపానాలు. పాఠకులలో ఏమాత్రం ఆనంద పరిమళాలను మేల్కొల్పినా, వారిని మానవతా శిఖరాలకు ఎంతమాత్రం ఎత్తగలిగినా నా ప్రయత్నం ఫలించినట్లుగా భావిస్తాను. ధన్యోస్మి అనుకుంటాను.

ఎంత అధునాతనమైన, శాస్త్ర విజ్ఞాన సమన్వితమైన వస్తువునైనా సనాతన ఛందోబంధురమైన పద్యాలలో చెక్కు చెదరకుండా రసనిర్భరంగా చిత్రించే వీలుందని చెప్పడానికి ఈ కావ్యసంపుటిలో కొంత ప్రయత్నం చేశాను. అలాగే పురాణేతిహాసాలను కూడ అతి నవీన వచన కవిత్వపు రూపంలో అందించడానికి వీలుందనుకుంటున్నాను. అంటే భావశబలతను, రస నిష్పత్తిని ఏ ప్రక్రియాగతమైన కవితలోనైనా సాధించవచ్చు. కవి సమర్థుడైనపుడు, భావం శక్తివంతమైనదైనపుడు ఏ ప్రక్రియతోనైనా పాఠకుల్ని మెప్పించవచ్చునేమో! అయితే ఒక్కొక్క కవితా ప్రక్రియలో ఒక్కొక్క ప్రత్యేకత ఉంది. కొందరికి ఒక్కొక్క ప్రక్రియపట్ల ప్రత్యేకమైన అభిమానం ఉంటుంది. అందుచేతనే నాలో పూచే అనుభూతుల్ని నాల్గు దండలుగా అల్లి కవితా జగత్తులోనికి రసజ్ఞులు సాగివచ్చే నాలుగు రాజమార్గాలలో తీర్చి కడుతున్నాను. నా ప్రయత్నం సార్థకమౌతుందని ఆశిస్తున్నాను.

ఈ "పద్యకావ్యాలు" ఈ సంపుటి రూపంలో రావటానికి ముఖ్యమైన హేతువు శ్రీ బోయి భీమన్నగారు. ఆయన ప్రోత్సాహంప్రోద్బలం లేకుంటే నా కవితా వ్యాసంగం తీరని కోరికగానే ఉండిపోయేది. ఎంత సారవంతపుదైనా నా భావనాక్షేత్రంలో కావ్య సస్యాలు పండివుండేవి కావు. ఆయన ఒప్పుకోక పోయినా ఈమాట సత్యం కాకపోదు. ఆయన పుంభావ సరస్వతి. ఆయనకు తెలియకుండానే ఆయన నన్ను మేల్కొల్పి కవితాక్షేత్రాన్ని సాగు చేయటానికి పంపిస్తారు. నాచేతిలో ఏదో ప్రతిభా హాలం ఉన్నదని, ఆ తర్వాత నేను కృషి పండితుణ్నవుతానని ఆయన అనుకుంటూ ఉంటారు. అంతటి మహానుభావుడికి నేను కృతజ్ఞతాంజలి ఘటించక ఎలా ఉండగలను !

ఈ కావ్య కుమారిని వలచి వలపించుకొన్న రాగమయుడు నా చిరకాల మిత్రుడు శ్రీపి. వి. జి. కృష్ణమాచార్యులుగారు. "ఒకరిని చూడగానె ఎదియో అనురాగము మోసులెత్తు" అని నేనొక చోట అన్నట్లు ఆయన్ని చూడగానే ఎవరికైనా అభిమానం కలుగుతుంది. ఆయన చిరునవ్వులోనే ఆ పలుకరింపులోనే జీవితోపనిషత్తులు ధ్వనిస్తాయి. మనిషిలోనే దేవుడు దాగియుంటాడన్న వేదాంతం వాస్తవంగా భాసిస్తుంది. వృత్తిరీత్యా ఆయన I. P. S. ఆఫీసరుగా పోలీసు డిపార్టుమెంటులోచేరినా ప్రవృత్తి రీత్యా ఆయన రసలోక తపస్వి. ముళ్ళమధ్య గుబాళిస్తున్న గులాబి ఆయన. తల్లి పెట్టిన పేరు సార్థకము చేసినట్టి గోపాలకృష్ణుడు ఆయన. ఎంతటి వ్యవహార దక్షుడో అంతటి నిరాడంబరుడు. ఆయనతో ఈ సాహితీ బాంధవ్యాన్ని నెరపుకుంటున్నందుకు ఎంతో సంతోషిస్తున్నాను. ఈ గ్రంథ ముద్రణాన్ని ప్రోత్సహించిన సాహితీ ప్రియులు శ్రీ ప్రభాకర్ రావు I. P. S గారికి సర్వదాకృతజ్ఞుణ్ని.

ఈ సంపుటిలోని పద్యాలను చదివి, విని, ఆనందించి నన్ను అభినందించిన అనేకమంది మిత్రులకు ముఖ్యంగా సర్వ శ్రీ సి. నారాయణరెడ్డి, దేవులపల్లి రామానుజరావు. యమ్. యన్. దీక్షితులు, జీ. రాంరెడ్డికి జె. జగ్గారెడ్డి, జె. యం. గ్రిగ్లాని, డా॥ అరిపిరాల విశ్వం, ముకురాల రామరెడ్డి, కప్పగంతుల లక్ష్మణశాస్త్రి, చర్ల గణపతిశాస్త్రి గారలకు, ఆర్. యం. శాస్త్రి దంపతులకు నా నమస్కారములు–కృతజ్ఞతలు.

పూజ్యులు, గురుతుల్యులుడా॥దివాకర్ల వేంకటావధానిగారు ఈగ్రంథానికిపీఠిక వ్రాయడం నా అదృష్టం. ఇందులోని పద్యశిల్పం, భావాలు ఆయనప్రసంశకు పాత్రం కావడం నా సుకృతం. ఆయనకు నేను వినయ పూర్వకంగా కృతజ్ఞతలు చెప్పుకుంటున్నాను. ఆయన ఆశీస్సుల బలంతో పద్యకవితా ప్రక్రియలో ఇతోధికంగా కావ్యాలు వ్రాయగలనని ఆశిస్తున్నాను. పాఠకుల, సహృదయుల ప్రోత్సాహం ఇందుకు తోడ్పడుతుందని భావిస్తున్నాను.

ఈ పుస్తకాన్ని ప్రచురించిన 'సుఖేలా నికేతన్' వారికి నేను ప్రత్యేకంగా కృతజ్ఞుణ్ని. ముఖచిత్రం చక్కగా చిత్రించిన ఆర్టిస్టు పి. ఆర్. రాజుగారికి సకాలంలో చక్కగా ముద్రించిన లలితా ప్రెస్సు వారికి నా కృతజ్ఞతలు.

—బాపురెడ్డి

స్నేహ శాలి, సాహితీ శీలి

# కృష్ణ మాచార్యునికి

ఒక మంచి శబ్దమ్మునకె, ఈల పాటకే
పొంగారు నీ అంతరంగమునకు
ఒక రమ్య భావమ్మునకె, రసవాక్కుకే
తీగలు సాగు నీరాగమునకు
ఒక హృద్య పద్యమ్మునకె, వర్ణనమునకే
సంతుష్టి నొందు నీ సహృదయతకు
ఒక భవ్య కావ్యమ్మునకె, నవ్య ఫణితికే
పరవశ మొందు నీ బాలమతికి

నా బ్రతుకు తోటలో వసంతాల లోన
విరియ బూచిన వేవేల సురభి శ్రేద్ధ
శబ్ద, భావ, పద్యముల మంజరుల, కావ్య
సంపదల నిత్తు కృష్ణమాచార్య ! కొనుము !

## 2

మనసిచ్చి నీ తోడ మాటాడు వారున్న
ఎరుగ వాకలి, దప్పి ఎరుగ వీవు
స్వార్థమ్ములేని స్నేహమ్ముల పొందులో
ఎంచ వాపద, నష్ట మెంచ వీవు

తమలమ్ము, ఆటపత్రమ్ములు ఉండెనా
కోటి సంపదలైన కోరవీవు
సరస వినోదమ్ము, శాస్త్ర విజ్ఞానమ్ము
లేనిచో జీవించలేవు నీవు

కలిసి నవ్వుచు నవ్వించ గలవు నీవు
స్నేహమే తప్ప వైరము చేయ వీవు
అట్టి నీ కన్న నా కవితాత్మ పొందు
డిట్ట ఎవ్వరు? నవరసరాట్టు ఎవరు ?

## III

### 3

మనము విశాఖపట్టణములో కలిసిన
నాడె ఆత్మలు పెంచి పాడినాము
భీముని పట్నపు బీచిపై పసి పిల్ల
లట్లు ఆటలు నాడు ఆడినాము
వెన్నెలరేలలో విపిన వీథుల చింత
పల్లి కొండల కైత లల్లినాము
పోలీసు పనిమీద పోయి, నేరము వెన్క
దాగిన సత్యాల తరచినాము

వృత్తి లేవైనను మనః ప్రవృత్తి లందు
పథము లవి వేరెయైన దృక్పథము లందు
ఒక్కటె మనము; స్నేహ పయోధిలోన
కలిసి విహరింతమా కలకాల మిట్లె!

### 4

మోవిపై చిరునవ్వు మురళీరవము కన్న
మోహనమైన దామోదరుడవు
నీలి ముంగురులేను నెమిలి పింఛము కన్న
మధురోజ్జ్వలమ్మైన మాధవుడవు

## IV

చేతిలో మధుపాత్ర శ్రీచక్రమున కన్న
చిద్విలాసము చిందు శ్రీధరుడవు
తరుణ భావాలె బృందావనమ్మున కన్న
అద్భుతావహమైన అచ్యుతుడవు

పద్మనయనుడ వాజానుబాహుడవు, చ
రాచరానందకర వాక్సుధాకరుడవు
శారదా ప్రసన్నుడవు ఈ స్వాదు ఫలము
గైకొనుము కృష్ణమాచార్య! కావ్యరమను!

—బాపురెడ్డి

బాపురెడ్డి

# పద్యకావ్యాలు

—o—

## కవితా ప్రస్థానము

నా ప్రత్యేకత నిత్య నూతనత, వీ
    ణావేణు సంగీత రా
గ ప్రత్యూషము నా నివాసము, నిస
    ర్గ స్వాదు సౌందర్య భా
వ ప్రక్షేపము నా విలాసము, జగ
    త్స్వప్న ప్రబుద్ధాంతరి
క్ష ప్రస్థానము నా మహాశయము, న
    క్షత్రాలు నా కావ్యముల్.

ఆదిత్యాంశువులే గణమ్ములు ; సమ
స్తామ్నాయముల్, శాస్త్రముల్
పాదమ్ముల్ ; గ్రహముల్, ఉపగ్రహములే
ప్రాసల్, యతుల్ ; మానవ
ద్యో దౌత్యాశయ దివ్య దిగ్విజయ సం
దోహమ్ములే భావముల్ ;
నాదబ్రహ్మయె శైలియై వెలుగు నా
నక్షత్ర కావ్యాలకున్ . 2

ఎన్ని గ్రహాలు, తారకలు
ఎన్ని ; ఖగోళమునందు విశ్వముల్
ఉన్నవి ఎన్నియో తెలియ
కున్నవి ; కన్నులు ఊహ లున్న , లో
కన్నులు ఉన్న మానవుల
గన్న జగత్తున ; కింత కాలమున్
కన్న యనేక స్వప్నములు
కట్టెదుటన్ నిజమైన నేటికిన్ — 3

గాలిని తేలుచే ఘనత
గా తలపోసిన రోజు లేగె ; భూ
గోళ ప్రదక్షిణమ్ము ఒక
గోవు ప్రదక్షిణ లీల చేయగా

జాలెడి కాలముఁ గడచె ;
జాబిలి భూతలి మధ్య రాయ బా
రాలు ఫలించె నేడు ; కవి
రాజయిః రోదసి నేలుకొందునే. 4

ప్రేయసి హాసమందు , నిరు
పేదల వేదనలందు , చిన్ని పా
పాయిల కన్నులందు , మధు
పాయిల కమ్మనిపాటలందు , మి
త్రాయత మానసమ్ముల , వి
హాయస వీధుల నే వెలార్చుచున్
పోయెడి భావ తారకలె
పో కలకాలపు నాదుకావ్యముల్ . 5

యోగమార్గమున ప్రయోగమార్గమ్మున
కాంచు చుందు దేశ కాలములను
కనులతోడ లోని కన్నుల తోడను
కాంచు చుందు సత్యకాంతి లవము . 6

# స్వప్న జగత్తు

**ఈ** నిరీహా సమీతి బాధా నిశా ప్ర
పంచ మందు, నిరాశా పవనము లందు
నలిగి ఆరెడి బ్రతుకు దివ్వెలను మాటి
మాటికిని వెల్గు మనును కమ్మనగు కలలు— 1

మానవుడు, పుట్టి స్వప్న బింబములనుండి
భ్రమణ మొనరించు స్వప్న గోళముల చుట్టు
వాసమైయుండు స్వప్న భవనము లందు
పైనమై సాగు స్వప్న విశ్వములు చేర—— 2

సకల సృష్టి ఏ మహనీయు స్వప్నఫలమొ ?
స్వప్నసంపద లే భావబలుని సృష్టి
యో ? కలయె నిజమగు నిజమే కలయగు
స్వప్న సత్యాలు వేదాంత సాగర మగు—— 3

గతము కన్నట్టి స్వప్నమ్మె కాద వర్త
మానము , భవిష్య మేమొ లీలా నిగూఢ
ముగ వెలుగు వర్తమానంపు మూగ కనుల
కొనలయందున , సాంధ్య జీవనములందు—— 4

మొగ్గ కన్నెలు తొలివలపు కల లందు
మధుపగీతాల తేలి సంబరముమీర
ఉదయరాగ లతాంకాన నిదుర లేచి
నగవు బిగువులతో తేనె నాట్యమాడు—— 5

శర్వరీ నీల నిద్రలో స్వాప్నికాను
భూతి రేఖలె మెరుపులై పూయు నేమొ ?
దిన సుహాసిని , గాఢ నిద్రను వెలుంగు
చూచి, మందస్మితోషస్సై లేచు నేమొ ? 6

కలలలో కోడె కోడి రాగల వెలుంగు
పుంతలో తానమాడి, ప్రబోధ భావ
గళము సారించి, నిదురలో గల యెదలను
మేలుకొలుపును, మేటి వైతాళికు నటు— 7

కూడు ఆశలు, ఆపదల్ గూడు గాను
బ్రతుకు శ్రామికజనులు స్వప్నములలోన
హాసవాసంతలక్ష్మి తద్వాసములకు
కదలివచ్చుట చూచి, పోయెదరు సాగి— 8

కాటువేసిన యపు డెడబాటు పాము
ప్రణయ జీవుల వెతల మూర్ఛనలలోన
సిత కపోతములై వచ్చి సేదదీర్చు
కలల గుండెలలో ఎంత కరుణ గలదో! 9

కాళిదాసుని విరహాంపు కలలు, గంట
మున విజృంభించి మ్రోగె యక్షుని గళాన,
శిల్పి రస కల్పనా స్వప్నసీమలే అ
జంత ఎల్లోర గుహాల వాసమ్ముచేయు— 10

సరస కవి భావనా స్వప్న సరసిలోన
పొంగు నవె నవాక్షర కావ్య పుష్పరుచులు,
స్వప్న గంధర్వ కిన్నెర స్వాదు గీత
ముగ్ధ హృదయమ్మె సంగీతమునకు నెలవు— 11

శ్వేత గజసమర్పిత జలజాత సుప్ర
సన్నతా స్వప్నమును కనకున్న ఉదయ
మొందునే తల్లిగర్భమ్మునందు శాంతి
దూత అజ్ఞానజేత బుద్ధుడు జగాన—— 12

శాస్త్ర విజ్ఞాని మస్తిష్క స్వప్రయోగ
శాలలో తేలిపోవు స్వప్నాలె, రాతి
యుగమును నడిపించెను అణు యుగమువరకు
కల్ల యనుకున్న దెల్ల సాక్షాత్కరించె—— 13

నరుని కిల స్వప్నమే చేతనా రథమ్ము
కలల అలల జీవనకథ ఇల చరిత్ర
నరుడు సప్నజగమ్మునే నాడు వీడు
ఆ దినమె సర్వసృష్టికి అంతిమమ్ము— 14

కోరి కోరి నే స్వప్న చకోరమౌదు
స్వప్న రోదసినౌకగా సాగిపోదు
రండి నా వెంట స్వప్నతారా వినోద
మోద గంభీర సాగరోర్ములను తేలి ! 15

# అద్వైతము

ఎద కదలించునట్టి తర
లేక్షణలన్ గురుతించి పాట పా
డెద నని , ఎక్కడోగల త
టిల్లతలన్ గని తన్మయత్వ మొం
దెద నని, నోరులేని ప్రకృ
తిఁ నుతియించెద నంచు మీరు న
న్నదయత నింద సేయకు డ
నభ్యుదయుం డని హేతుశూన్యులై . 1

వ్రాయగనె విలాసినులపై గేయములను
కూలి పిల్లను మరచు మూర్ఖుడనుగాను ,
ప్రకృతి సౌందర్యముల గూర్చి పాడగానె
మానవుని కష్ట సుఖములే మరువలేదు. 2

మన్నను దున్ను కర్షక కు
మారులు , ఆ గని—మిల్లు—ఫ్యాక్టరీ
మున్నగువానిలోన శ్రమ
మున్ వడపిండెడివారు , క్లార్కులౌ
అన్నయ లందరున్ ప్రజల
టంచు ఎరుంగుదు ; వారి బాధ లే
మున్నవో , వారి భావి ఎటు
లున్నదో కూడ ఎరుంగుదున్ సఖా! 3

స్వార్థ సంకుచిత తత్వాలకు దూరాన
తేలియాడెడి మేఘమాల జూచి
తన తల్లియేరు ఒడిని జేరనో యన
పర్వెత్తు సెలయేటి బాల జూచి
తన క్షణ జీవితమ్మును నిశా లోకాన
వెలిగించిపోవు చంచలను జూచి
శిశిరలోకపు గుండె చివురించు పువ్వుల
నవ్వుల నవవసంతమును జూచి 4

ఎద కరంగ పొంగారగ కదలియాడ
కైత లల్లిపాడితి నంతెమని , స్వార్థ
పరుడ గాలేదు, నాతోడి ప్రజల వాణి
వినక కూర్చుండినట్టి పాపియునుగాను. 5

ఒరుల కష్టము దోచుకొంచు జీవించు దా
నవుల నుత్కృష్ట మానవుల జేయు ,
స్వార్థాసురకు మర్త్యజాతిని బలియిచ్చు
మారణాస్త్రములలో మంచుపేర్చు ,
సుఖమును కలనైన చూడని ప్రజలకు
సుమనోజ్ఞ భావిమార్గమును చూపు ,
మన సంఘ జీవితమ్మును వికారించు దు
రాచారములను చితాగ్ని ద్రోయు— 6

నిశిత కవితలు వ్రాసెడి నేనె కరిగి
కలికి చిరునవ్వులకు భాష్యములు రచింతు
ప్రకృతి సౌందర్యములను కావ్యముల నింతు
కష్ట సుఖముల రెంట భాగమ్ముగొందు. 7

# అనుతాపము

ఒక ప్రభాత సమీర వీచికను తేలి
వచ్చి, నాజీర్ణ జీవిత పర్ణశాల
జొచ్చి, చూచి, నిట్టూర్చి, అశ్రులకు బెదరి,
ఏల మరలి పోయెదవె ఆశా లతాంగి ! 1

మంచువలె నున్న నన్ను కదలించి, భావ
నా ప్రపంచాన దించి, ఉష్ణమ్ము నించి,
గగన మంట పొంగించి నన్ గడియలోన
నేలపై కూల్చితివి శిలవోలె బాల ! 2

ఏమయి పోయె నేను రచి
యించిన ఈ చిరుగాలి పైని శో
భామయ స్వర్గసీమ ? నవ
భావి కళాత్మక సౌఖ్యజీవితో
హో మధురానుభూతి ? నుడి
కందని స్వప్న జగ ద్విహారమే
దేమయి పోయె ? ఇంక శమి
యింపవొ ఈ పిడుగుల్ తుపానులూ ? 3

ఈ పూలతల మాటునే విషసర్పాలు
పొంచి యుండుట నే గ్రహించనైతి
ఈ మృదు జలదాలనే భీషణోల్కాశ
నులు గల వంచు నే తెలియ నైతి
ఈ సిత జ్యోత్స్నలోనే నీలి నీడలు
తిరిగి వేటాడు టే నెరుగనైతి
ఈ నిశ్చలాంబుధియే పొంగిపడి తాండ
వించుట నే విలోకించనైతి 4

అరరె! ఈ జగజ్జీవ లాస్యమ్ములోని
మృత్యుదేవత పాదాలమీది విలయ
కింకిణీ క్వాణముల నాలకించనైతి
ఆశ ! నీ మీది మోహాన మోసపోతి ! 5

ఊహాల మత్తులోన యువ
తోర్వశి గానతరంగ డోలలో
నా హృదపూర్వ శిల్పికృత
నవ్య కళాంబర సౌధ మందు , నా
దేహము గేహమున్ మరచి
దివ్య పథమ్ముల స్వప్నచంచలా
వాహన మెక్కు చేల , భువి
వ్రాలిపడన్ పరితాప మేలకో? 6

గతకాలోగ్ర వనమ్ము దాటితిని దుః
ఖమ్ముల్ దిగన్ మ్రింగి , శా
శ్వత సౌఖ్యాలయ మీవు చేర్తు వను వి
శ్వాసమ్ముతో ; వమ్ము చే
సితి వీ నాటికి సర్వభావనలు , పై
జీవింతు నే రీతి ? కా
ల తమోగర్భమునందు భావియు కనన్
రాదాయె ఆశాంగనా! 7

తృప్తి బంధాల నన్ను బంధించి వైచి
విశ్వ మెల్ల ప్రేమించి జీవించ నేర్పి
వాస్తవ జ్ఞాన భాస్వర పథము నడచు
టొకటె సుఖ మనిపించు 'కోరికల రాణి! 8

# వసంతోదయము

ఈ రసాల వృక్షాల కోయిలగళాలు
పోసిన సుగాన సుధ త్రాగివేసె నేమొ ?
మండుటెండల గ్రీష్మమందు ఎండు పోవ
మధువుతో పొంగు లెత్తె నామ్రఫలజాతి. 1

లాగెనో లేదో పసుపుచేలాలు ప్రిదుల
శిశిర దుశ్శాసనుండు గర్జించి వచ్చి ,
పచ్చపచ్చని క్రొవ్వలిపమ్ము లురల
వనకుమారి వసంతయై పాడె నదిగో—
ఏమురారి మొరాలించె నేమొ కాని. 2

కరుడు గట్టిన హిమశిలల్ కరిగి ఝరిగ
పారె వాసంత కోష్ణ నిశ్వాస లందు
విప్లవోషస్విని క్రాంతి వీక్షణాల
కరిగిపారెడు దాస్యాంధకార మట్లు. 3

విచ్చిన సుమాలు మధువుల వెల్లివిరిసె
భ్రమరయువకాళి ప్రణయగీతముల కరగి
హెచ్చిన వియోగబాధ నా ఎద రగుల్ప
భావకవి చేసె నన్నొక దేవి మోవి. 4

నాడు శిశిరాన ఓదార్చినాడు , ఏడ్చి
నాడు , కవి జీర్ణలోకమ్ము చూడలేక ;
నేడు వాసంతమున పొంగినాడు పాడి
నాడు శుభగీతి ముందుండి నాడు నేడు. 5

# కృతఘ్నత

సుందరాస్యము కళమాసి కంది పోవ
నుదుటి కుంకుమ ముంగురుల్ చెదరిపోవ
హతహృదయ దీన సందేశ మట్లు దుఃఖ
బాష్పములు రాల్చె దేలనో ప్రకృతి దేవి! 1

అరయ నీదు ఉపేక్షా స్వయంకృతాప
రాధములె నీదు శోకకారణము గాద ?
కాక ఎవరేని చింతయే లేక తన బ్ర
తుకును బహిరంగపరచుకొందు రటె తల్లి ! 2

ఎంత అమాయికమ్మొ జన
నీ ! కనులారగ చూచుచుండియున్
వింత ప్రవర్తనాన కను
పించిన ఈవిష మాన సార్భకా
నంత హితమ్ము లోని నట
నమ్ము గ్రహింపక, జాలి బూని, కా
ల్పాంతక దుష్కరాలకు మ
హాబల మేల యొసంగినా వొకో ? 3

తెలియ దలే మదంబ, భవ
దీయ మహోజ్జ్వల జీవితమ్ము లో
గల కన రాని శక్తి కళ
కల్ — హృదయాలు నశించి నట్టి లో
భుల జ్వలితాగ్ని దృక్కులకు
మోసములో పడి చూపినావు ! త
త్ఫలము విషాద బాష్పకణ
ధారలు గాక మరేమి యౌనటో ! 4

విశ్వరహస్య విహగమ్ము పెంచి దాచి
ఇచ్చినావు జీవిత మూల్య మెరుగ నట్టి
నరుని రాతిచేతులకు, ఏ నాడొ పీల్చు
ఆసురత దాని కోష్ఠ ప్రాణానిలములు. 5

ఆ హిమ శైల శృంగతతి
యా, ఉరు వార్ధి తరంగ ధాటియా,
వాహినులా, మరుత్తుల ప్ర
వాహములా-ఇపు డాప నోపు త
ద్రోహ కరాళ కాండ? ఘన
దోర్బల సంయుత క్రాంతి శాంతి హిం
సాహస యాత్రలా? మనిషి
యాకృతి చేతనె మానవుం డటే? 6

ఉగ్రోగ్ర మైన స్వార్థోన్మత్త నర్తకీ
హేలయ నాట్యాల శిథిలముల గని
మతి హీన దుర్మార్గ కృత దానవత్వ కృ
త్యాల వెల్వడిన రక్తాల గాంచి
కుటిల మూర్ఖత్వ సంకుచితత్వ తత్వాల
కేళీ నిమిత్త శోకాలను విని
ద్రోహాన అణుశక్తి దుర్వినియోగాన
కాల్చిన ధరణి వక్షమ్ము జూచి

తత్కృత కృతఘ్నతాపరాధము గ్రహించి
నేడయిన దానవత్వము వీడి నరుడు
స్వచ్ఛ మానవతా సుధా స్నాతుడైన
మానవుడు కాక పోడులే, మాను వగపు ! 7

అతి సూక్ష్మ పరమాణు వైన అంతము లేని
బ్రహ్మాండ మైన చొరబడు వాడు
కుల మత జాతీయతల రాజకీయాల
ద్వేష భిత్తికల ఛేదించ లేడ ?
సెలయేటికన్న వెన్నెలకన్న విహగమ్ము
కన్న స్వేచ్ఛా విహాయస విహారి
సామ్రాజ్యవాద వలస త్వాసమానతా
బద్ధ దాస్యమ్మును బాప లేడ ? 8

వానరుడు దానవుడు కాడు మానవుండు
అనెడి కీర్తిని గడియించు కొనును గాక
నీకు ఆనంద నిధులను నించు గాక
ఓ ప్రకృతి మాత ! నీకు జయోస్తు ఎపుడు ! 9

# పరీక్ష

నా నవోన్మేష యౌవ నానంద సరసి
లో జనించిన ప్రణయ సరోజ సుమము
అమల ప్రేమాంజలి ఘటించి అర్పణమ్ము
చేయ నీచరణాలకు— త్రోయ నేల ? 1

పేద నని ఎంచినావో నా ప్రేమమూర్తి !
వెర్రి నని ఎంచినావో తపింప జూచి ?
కాను నిర్భాగ్యుడను, వెర్రిగాను నేను
నా మనస్సీమ దాచితి ప్రేమ ధనము . 2

జీర్ణ పర్ణ కుటీర నిశీథ వాసి
నైన నేమాయెనే నిర్దయాత్మురాల !
మన కొరకు శాశ్వతానంద మధుర భావ
గాన సౌధాలు నిర్మించినాను రమ్మ. 3

ఎద ఎద వసించి, హసియించి, ఎగసి ఎగసి,
ఇంద్రలోకాలు కూడ జయించి, మృదుల
జలదశయ్యల సౌదామినులు కొలువ సు
ఖంచ నూహించి నిన్ను ప్రేమించినాను. 4

అచ్చర కన్నె వంచును ఉ
　　పాంగన వంచు, తటిల్ల తాంగ వం
చెచ్చట లేని ప్రేమ ప్రక
　　టింప, నటింపను; అట్టి కన్య పై
ఇచ్ఛయు లేదు; చల్లగ చ
　　లించెడి మానవతా లతాంకమున్
విచ్చుచు నున్న నిన్నెద జ
　　పింతు వరింతు, మనుష్య భామినీ! 5

సుందర గిరి స్రవన్నదీ మంద మంద
గీతి కారావ మలయాని లాతి శీత
కాంతిపూర్ణ ప్రశాంత వనాంతర సువి
హార మోహన స్వప్నము లవియె చాలు. 6

ఇంత పడ్వించి ప్రేమ బాహ్యాంతరముల
సంతరించితివా సుప్రశాంత హృదయ!
ఎంత రసికవు! ఇటు పరీక్షింతు వటవె?
కొంత తడయుము నిను పరీక్షింతు నేను. 7

# రసరాగము

మలయ సమీర మన్న, మధు
మాసము లన్న, పికమ్ము లన్న – వె
న్నెలలు, మొయిళ్ళు, తారకలు
నిర్ఝరు లన్నను తన్మయుండ నై
శిలలు కరంగు నట్లు, పెను
చీకటు లెల్ల వెలుంగు నట్లు, నా
కలలు నిజమ్ము లౌనటుల
గానము సేతు రసాను భూతులన్ . 1

అందిన అందమైన సుమ
హాసము పొందినవాడ కాన నే
అందని తారకా ద్యుతుల
కై తపియింతును, నన్ను తన్మ నో
మందిర మందు నిల్పు కొను
మానిని రాగ మెరింగి నందు కే
కుందుచు నుంటి నా వలపు
కోరక నా యెద దోచువారికై . 2

తారలలోన తార, మధు
ధారలలో మధుధార, బాల శం
పా రమణీయ లాస్య సుర
బాలలలో సుర బాల కోసమై

దారమునై అదృష్టపు ప
తంగము నింగికి లేపి, సమ్మతిన్
తీరని తీయనౌ కలల
తీరముపై విహారింప బోయెదన్ . 3

పూవుల అంద మందరిది
పూచిన తీవ ఎవళ్ళదైన , స
ద్భావ రసమ్ము అందరిది
భావుకు డేగృహవాసి యైన , గా
నావళి శ్రోత లందరిదె
ఆ ప్రియ గాయని ఏరిదైన, ఏ
లా విడ లేరో స్వార్థము అ
నంత కళావిభవమ్ము కోసమున్ . 4

పాడెద వేయి సారు లిదె
పాట ను ; పాడెద లక్ష తీరులన్
వాడని భావముల్ మలచి ;
పాడెద సుందరతాబ్ధిచిత్తు నై ;
ఆడెద కోటి భంగిమల
ఆడిన ఆటనె ; ఎంత త్రాగినన్
వీడని దాహ మార్పగల
వింత రసామృత పానమత్తునై ! 5

# ఆనందయోగి

ఎవరు ఛేదించ గలరు నే నీ జగాన
కట్టుకొన్న ఆనందాల కలల కోట ?
ఎవరు వారించ గలరు నే నీ బ్రతుకును
మధుర గీతాల మాలగా మలచుకొనుట ? 1

నేను వసంతవాటికకు
    నేగి ప్రమోదము చెందకుండ ద్వే-
షానల చిత్తు లెవ్వరో న
    నడ్డెద రౌర ! ఎరుంగలేక — నా

లోసె వసంతలక్ష్మి ఎద
లోని ఎదవలె నాట్య మాడి , అ
మ్లాన మహానుభూతి సుమ
మంజరులన్ రచియించి మించుటన్ ! 2

చల్లని సంజగాడుపుల
సాగర సైకత తీర మందు నే
నుల్లము పొంగగా తిరుగు
చుండుట ఓర్వమి త్రోసినారు , ఘూ
ర్ణిల్లు పయోధిలో ఎవరొ
రేయిని దాగి , గ్రహింపలేక— రం
జిల్లెద నంచు ఆ కడలి
జీవన మౌక్తిక రత్నదీపమై . 3

మబ్బుల మీదుగ సాగెడి భావవి
మానములో పయనించెడి నన్
దబ్బలి ఎవ్వడొ కూల్చగ జూచెను
దారుణ దుష్టగుణాశనినై
అబ్బరమొందెను కుందెను నా ప్రతి
అంగము ఛత్రవిహంగమమై
కబ్బము అల్లుచు గాలిని తేలుచు
గానము చేయుట చూచి మదిన్ . 4

కోరుకొన్న గులాబీలు కోయునపుడు
క్రూర మగు ముళ్ళు నాచేయి కొరికి, మురిసి
పడును గాని ఎరుంగవు—ప్రణయతత్వ
బోధయేగాని నా కది బాధకాదు. 5

అష్టైశ్వర్యము లేవో నా కడకు రా
నడ్డంకులం బెట్టి పా
పిష్టుల్ నాకిల కష్టనష్టములు, దు
ర్భిక్షమ్ము కల్పింతురా !
ఇష్ట మ్మైనపు డన్న మే కమి కెడో
ప నీడయో యున్న సం
తుష్టిం చెందెడి నన్ను, స్వార్థముల వ్యా
ధుల్ ఎట్లు బాధించెడిన్ ? 6

అమృత మట్టులనే హాలహాలము గ్రోలి
వెన్నెలట్టుల చీకటి కన్నె వలచి
పరవశిల్లెడి నన్ను ఎవ్వరును ఏమి
చేయగలరు ? ఇక్కట్లు నన్ చేరునెట్లు ? 7

ధ్రువముల హిమశిల లైనను
అవనీ గర్భాంత రోష్ణ మైన భరింతున్
అవమానము సన్మానము
ఎవరే మొనరింప సత్య మేను వచింతున్. 8

# అనింద్య

నిను విసిగించి , నీ కనుల
నిండి స్రవించు కవోష్ణ బాష్ప వా
హినులను చూచుకొంచు హాసి
యించుచు, వేడుక జెంద నాకు భా
వన కల ; దైన నాకములె
భవ్యములై కనిపించు నీదు చ
క్కని నును చెక్కుటద్దములు
కందు నటించు భయ మ్మగున్ ప్రియా ! 1

ఎన్నివిధాల నన్ను హృద
యేశ్వరి ! కోతలు పెట్టినావో , నా
కెన్నగ సిగ్గుకల్గు అవ
హేళన లెన్ని యొనర్చినావో , నీ
కన్నిటి కన్నిరెట్లు కఠి
నాత్మత శిక్ష నొసంగ జూడ నీ
కన్నులు రువ్వు దృగ్గతలు
కట్టెడు నా కరయుగ్మ మంతలో. 2

అర్చనము లేని నా యౌవ నాలయాన
చంచలాదేహ ! నిను ప్రతిష్ఠించుకొరకు
ప్రణయ గీత మంత్రా లెన్ని పాడినానొ
ఎన్ని గరళాబ్ధు లీదితి నెరుక గలదె ? 3

చుక్కల వెక్కిరించు కను
        చూపులె గాక, చివుళ్ళ మెక్కి మ
త్తెక్కిన కోకిలమ్మ నవ
        హేళన సేయు గళమ్మె గాక, నా
వాక్కుల కందరాని భగ
        వంతుని సృష్టికె మూలమౌ ఎదో
చక్కదనమ్ము నీ యెద ని
        జమ్ము చెలీ! కనుగొంటి నా హృదిన్. 4

నీ పదాబ్జాలు చేరవచ్చే పథాల
పరుగు లిడి కోటి గండాల బయట పడితి——
నా ఘనతచేత కాదు అందాల బాల !
నీ ప్రణయ మహిమ వలననే ప్రియతమ ! 5

నీ రవళించు అందియలు
        నీరసమైన మదంతరాన ఏ
వో రసవ ద్వసంతముల
        'కో' యని 'కూ' యని పించు శ్రావ్య శృం

గార సుధార్ద్రి కావ్యముల
కమ్మదనమ్ముల తోడ పాడి, మం
దార మనోజ్ఞ భావముల
నారులు వోయును, నాట్య సుందరీ! 6

నీ విషాగ్ని పరీక్షల నెగ్గినట్టి
నన్నె వరియించి, యుష్మద్ ప్రణయ సుమాల
మాల నాకె యర్పించి సౌఖ్యాల నేలు
దేవి! మేధావినిని కళాదేవి వయ్యు. 7

ఈ కొరగాని లోకమున
ఈ క్షణికంపు సుఖాలలోన ఏ
మో కల దంచు నే భ్రమసి
యుంటిని ఇన్ని దినాలు, నేడు నీ
లో కనుపించు కాంతి ఝరి
లో కనువిప్పెను నా యెడంద, నే
నీ కను నీడ లందు రమ
ణీ! రసలోక తపస్వి నయ్యెదన్. 8

పిచ్చి సరసాల నిన్ను ఏడ్పించ నెంచి
ఏదొ ఏదో అనబోయి దేవీ! త్వదీయ
ముగ్ధ లావణ్య మహిమాబ్ధి మునక లిడితి,
హాస్యమున కైన నీవు శిక్షార్హ వటవె! 9

# సుప్రభాతము

(విశాలాంధ్రావతరణ సముత్సాహములో)

సుప్రభాతము, ఓ వసంత ప్రసూన
వనములార! ప్రాభాత శోభా ప్రదీప్త
మిత్రులార! కళా జగ చ్చైత్రులార!
ఉజ్జ్వల నవీన వర్ష మహోదయాన 1
సుప్రభాతము—

ఆ కుసుమిత వనవిలాసినీ కచమ్ము
వోలె నా యెద నాశా సుమాలు పూచె,
పిక లసద్గాన పులకిత ప్రకృతి భంగి
మన్మనము భావ సౌరభ మగ్న మయ్యె. 2

ఎన్ని వసంతముల్ గడిచె
నెన్ని ఉగాదులు వచ్చి పోవలే
దెన్నడు నాకు ఇట్ల వచి
యింపగరాని మహానుభూతి గ
ర్వోన్నతి కల్గలేదు ; భర
తోదధి నాంధ్ర మహాతరంగ మి
ట్లెన్నడు అంబరోన్నతి గ
మించుచు పొంగుచు పాడలేదురా ! 3

బాల బాలికలు పుష్పాలవోలె ప్రభాత
వేళ ఆస్యాల హాసాలు నింప
ప్రతి గృహ మ్మొక పల్లవిత మహీరుహ మట్లు
పచ్చతోరణముల పరిఢవిల్ల
యువతీ యువకులు కలవిహంగముల కిల
కిల లట్లు పరిహాసములను విసర
ప్రతివాడు మలయ మారుత వీచు లట్టు లు
జ్జ్వలభావి తావి శ్వాసలు వెలార్చ 4

ఎటుగనిన రాగ మంగళార్భటి చెలంగ
పటుతరోత్సాహ దివ్య ప్రభలు వెలుంగ
నేడె ఊరూర వనలక్ష్మి నిల్చి యింపు
గా ఉగాది జరుపుకొను కరణి తోచు! 5

తెల్లని వేప పూ వొగరు
    తీరిన మామిడికాయ బెల్లముం
చల్లని నీట కల్పిన రస
    మ్మును దొన్నెల నిండ త్రాగి మ
త్తిల్లి సురత్వ మొంది నవ
    దివ్య వసంత కళా విలాస సం
ఫుల్ల జగత్ ప్రమోద పరి
    పూరిత గీతిక లాలపింతమా! 6

గున్నమామిడి, తన ప్రియకోకిలమ్ము
వీడిపోయి ఆనాడు, తపించి, తిరిగి
నవ్యముగ నేడు కూడి గానమ్ము సేయు
నాంధ్ర తెలగాణ మేకమై నట్టి తమిని 7

ఇంతటి శుభదాభ్యుదయ వసంత వాటి
నడుగిడు కతాన "దుర్ముఖి" యయ్యు సుముఖి
యే యగును రా నవీనాబ్ద మెట్టులనిన
శుక్తి గర్భాన పడు చిన్కు ముక్త కాదె! 8

(ఆంధ్రప్రదేశ్‌లో ఉదయించిన తొలి ఉగాది సందర్భములో)

# మనశ్శాంతి

ప్రేమించలేదు నిన్ ద్వేషించలేదు, అ
ట్లని తటస్థముగ నుంటి నని కాదు
నవ్వించలేదు నిన్ కవ్వించలేదు, అ
ట్లని అరసికుడ నైతి నని కాదు
రమ్మనలేదు నిన్ పొమ్మనలేదు, అ
ట్లని పల్కరించ లేదనియు కాదు
త్వరపడలేదు నే పొరపడలేదు, అ
ట్లని ఋషీశ్వరుడ నే ననియు కాదు

మన చెలిమి తీరులోని ఆ మహిమ మేమొ
వింతగా కూర్చినది మన శ్శాంతి నాకు
నీరజ దళమ్ముపై నుండు నీర మట్లు
నేను నీతోడ కూడి యున్నాను......?

# సరససాగరుడు

ఖండ ఖండాలు నీదు కైదండ లోన
నిల్చుకొన్న మహాంబుధీ! నీ గభీర
హృదయ గానము వినెడి నా హృదయ మందు
నవ్య భావన లేవియో నాట్య మాడు. 1

ఆడుకొందువు, పాట పాడుకొందువు దివా
రాత్రమ్ము లీవు వారాశి రాజ!
ఇరు సంజలును నీకు మృదు గంధవహ తాళ
వృంతాలు వీచును వీచి రాజ!
వెన్నెల కన్నె కన్పించిన చాలు, మై
మరచి నీయెద పొంగి పొరలు నౌర!
ఎటు పొరలిన మేను పొటమరించని రీతి
పరచుకొంటివి ఇసుక పరుపు చుట్టు! 2

ఎంత రసికుడవో నదీ కాంత లంత
దూర దూరాలనుండి నిన్ చేర వత్తు
రొక్కరికి తెలియకుండ మరొకరు! సుంద
రతకు ఆనందములకు శరధివి నీవు. 3

ఏ మని పాడె దోయి ? ధర
　　ణీ పరిణామ కథా విశేషముల్
నీ మధు రానుభూతులను,
　　నీకలలన్ సమకూర్చి తీర్చి శో
భామయ గీతు లల్లుకొని
　　పాడెద వేమొ, అనంతకాల జీ
వామృత సాగరా! భవ ద
　　యంత్రిత భావ తరంగ వీణపై ! 4

పులకరించితి వేని సజ్జల కణములు
ముక్తి పొంది యైపోవును మౌక్తికములు
రక్తి చెందెద వేని చిరత్న శిలలు
ధన్యతను చెంది కావె రత్నాల జాలు— ! 5

నీ యుచ్ఛ్వాసములే పయోధరములై
　　నింగిన్, ధరా వర్షమై
ఆయా దేశ నదీ నదమ్ము లయి నీ
　　యం దేవిధిన్ లీనమౌ
నో యారీతి సమస్త జీవులును ఏ
　　దో జీవనానంద సం
శ్రేయోవిర్భవ మొంది అందె తుదకున్
　　లీనం బవున్ , సాగరా ! 6

# రవీంద్రకవీంద్రుడు

హిమ గిరీంద్ర శిఖరి ,  హిందూ మహాంబుధి
గంగ , యమున , కృష్ణ కలవు మాకు
కలవు తూర్పు పడమరల కనుమలు మాకు
కవి రవీంద్ర !  నీవు కలవు మాకు ! 1

కలవు కాని నేడు కనరావు కనులకు
ఐన లేదు నీవు లేని చోటు
లోని కనులు విప్ప లోకమ్ము నిండార
కలవు నీవు, వెల్గ గలవు నీవు ! 2

వంగమె కాదు, ఈ భరత
వర్షమె కాదు, ప్రపంచ మెల్ల ఉ
ప్పొంగెను నీయెడంద విర
బూచిన కావ్యకళా పరీమళో
త్తుంగ తరంగ డోలికల;
దుర్భర దాస్య విశీర్ణ సాహితీ
ప్రాంగణ మందు నాటితి వ
యా విలసద్రస పారిజాతముల్ ! 3

శీతాద్రివై నీవు గీతాంజలి ఘటించి
ప్రకృతిలో లీనమై పాడు నపుడు,
విశ్వ భారతి వీణ వినిపించె నొక క్రొత్త
శ్రుతి, నవజీవన రుతి; రవీంద్ర !
దేశాల విడదీయు ద్వేషాగ్ని కుడ్యాలు
కూలె, ప్రాక్పశ్చిమాల్ కూడి పాడె

ద్యోగంగ భూగంగతో కూడి ప్రవహించె
నరునిలో దివ్య గంధములు వీచె 4

ప్రావృ డంభోధర రథమ్ముపై నొకపుడు
పుష్ప సురభిళ వన మార్గమున నొకపుడు
స్వామి యేతెంచి, నీ హృది ప్రేమ హస్త
ముంచి, ఆనందజలధిలో ముంచె నిన్ను. 5

మంజుల భారతీ హృదయ
మందిర మందున నిల్పి, దేవ భా
షం జెలు వొందు నా ఉపని
షన్నవసారము పండి, నీవు గీ
తాంజలి పట్టు నప్డు హృద
యాంజలి పట్టి జగజ్జనాళి భ
క్తిం జపియింపరే భరత
దేశ యశోరవి నిన్ జగత్కవీ! 6

సృష్టించితివి కవిస్రష్ట! 'గోరా' ను నీ
దేశ భక్తికి దివ్యదీప మట్లు;
ఒక అల్పఘటన మొక్కొక చరిత్రకు బీజ
మిడు నని తెలుపు నీ 'పడవ మునక'

నీలోని స్వేచ్ఛా దయా లక్ష్మి ఉప్పొంగి
పారెను నీ 'ముక్తధార'లోన ;
నాట్యాభినయ కళా నృత్యంబు చాటింప
గల్గె నీ "నర్తనకన్య పూజ"., 7

అమృత హృదయ ! నీ కథలు సత్యములు చాటె
నీ పవిత్రగానమ్ము వెన్నెలలు గాచె
శ్రీ రవీంద్ర కవీంద్ర ! నీ సిద్ధ వాగ్జ
నిత సరస్వతి విశ్వ జనీన మయ్యె ! 8

మంచుకొండను జూచి, మానసమ్మును పెంచి
అమృతధారగ పారినట్టి నీకు ;
ఎండకాలపు గుండె ఏమేమి వాపోవు
చుండెనో వినిపించుచుండు నీకు ;
మెరపు ఖడ్గము లాగి చిరకాల దాస్య శృం
ఖలములు తెగవేయ గల్గు నీకు ;
బ్రతుకు నేలను పండు లాభ ప్రమోదాలు
అనుభవించుచు ఋషివైన నీకు ; 9

మన్ను దున్నెడి మనుజుల మధ్య ఎపుడు
దేవు డుంట గాంచిన గురుదేవ ! నీకు
గురు వొకండు , బడి యొకండు ధరణి లేవు
ధాత్రి విరచిత ప్రకృతి పుస్తకము తప్ప ! 10

నీ జన గణ మన గానము
నీ జాతికి గీత మయ్యె, నీ స్వప్నము స
ద్యోజాత సత్య మయ్యెను
మా జీవిత శరశ్చంద్రమా! కోకిలమా! 11

ఖండాంతరసుల భారత
ఖండమున కఖండ కీర్తి గడియింప కవీ
ట్కాండమ్మున నీవె కవీం
ద్రుండ వనిరి లోక కవివరుల్ సత్యాత్మన్! 12

నీ గభీరానంత సుందర
తా గవేషణమున సుమించెను
ఆ యపూర్వామ్లాన తారు
ణ్యా మృ తోషా బాల ఊర్వశి! . 13

నీ దృఢోజ్జ్వల మానవతా్వ
రాధనమ్మున నిల్చె "శాంతి ని
కేత"నమ్మున విశ్వ భారతి
భూతలము వెల్గన్! 14

సరస సాహిత్య సంస్కృతీ స్నపిత మైన
ఆంధ్ర జాతి నిన్ గుండెల కద్దు కొనుచు,
నీ కళా మందిరములను నిల్పుకొనును
అభ్యుదయ శాంతి శిఖర సమగ్రములను! 15

# స్నేహ సౌరభము

ఎక్కడి దాన వీవు ,  మరి
　　యెక్కడి వాడను నేను , ఎట్టులా
చక్కని సంజ వేళ ధ్రువ
　　సాగర తీరము మీద ఎందుకో
చుక్కల వోలె రాలిపడి
　　చూచితి మొక్కర నొక్క ;  రూహకున్
చిక్కని స్నేహ బంధమున
　　చిక్కితి మొక్క క్షణమ్ము లోననే !　　1

దాహము తీరె నా ఎదకు
　　తన్వి !  భవద్రస వాక్కు లందు ;  సం
దేహము తీరె నాత్మకు ప్ర
　　దీప్త భవన్ముఖ హాస  రేఖలన్ ;
మోహము లేని స్వచ్ఛ తమ
　　మోదము కూర్చు నిసర్గ రంజక
స్నేహము మించు భాగ్య నిధి
　　సృష్టిని లే దనిపించె నయ్యెడన్.　　2

ఒకరిని చూడగానె ఎది
యో అనురాగము మోసులెత్తు, వే
రొకరిని చూచి చూడగనె
ఓర్వమి ద్వేషము పొంగు లెత్తు, దే
నికి గల కారణమ్ము రమ
ణీ! కనరాదు వితర్క హేతు వా
దికి ; మరి జన్మ జన్మలకు
తీరని వాసన లుండ కుండునా! 3

నా దేశ మీ వంక నీ దేశ మా వంక
నడుమ యున్నవి మహా జడధు లేడు
నా మతమ్మునకు నీదౌ మతమ్మునకును
వయసు భేదము వేల వత్సరాలు
కుల మున్నదను నాకు కులము లేదను నీకు
నడుమ అగాధ వర్ణవ్యవస్థ
నా రంగు నా రూపు నీ రంగు నీ రూపు
వెలుగు చీకటు లట్లు వేరు వేరు 4

ఇంత అంతర మున్న ఆవంతయైన
అడ్డు లేదయ్యె ఆత్మ సమైక్యమునకు
లౌకిక స్వార్థచింతనానేక బాహ్య
బంధనా లేల మన స్నేహ బంధమునకు ? 5

పాదు పంది రేని లేక పారు తీవ లట్టులన్
ఆది అంత మేది లేని అంబుదాల పోలికన్
రోదసీ హృదంతరాల లోని తార లట్టులన్
నాదమట్లు వేదమట్లు నాదు నీదు స్నేహమో. 6

పాడితి వీవు నా ప్రణయ
 పల్లవ బాహులరసాల శాఖలన్
వీడక నిన్ను పట్టుకొన ;
 వేల అకాల వసంత మాధురుల్
పాడెను ; శీతవాతములు
 భగ్గున మండెను ; ఆ దినమ్మునే
నాడు స్మరించుకొన్న స్మృతి
 నాళము మ్రోగును శబ్దపేటియై ! 7

నీవు పాడియు పాడించినావు నన్ను
నీవు ఆడియు ఆడించినావు నన్ను
భావములు నావి పాటలో భాష నీది
ప్రేరణము నాది నాట్యాల రీతి నీది. 8

వచ్చి పోవవచ్చు ప్రభువులు ప్రభుతలు
కాని—నిల్చిపోవుగా చరిత్ర
చచ్చి పోవవచ్చు సశరీర ప్రేమికుల్
చచ్చి పోదు ప్రేమ శాశ్వతమ్ము. 9

# నెదరులాండు

ఎగసిపోయి మిన్నంట నే నెగసిపోయి
సింధువులు క్షేత్రములు గిరి శృంగములను
దాటి వ్రాలితి మంచుపూతోటలోన
రాగసాగర నవ్యతీరాల లోన— 1

ఎచ్చట చూచినన్ సుమము
    లే సుమకోమల బాలలే సిరుల్
విచ్చిన జాడలే మధువు
    వెచ్చదనమ్ములు పంచు వాడలే

పచ్చిక బీడులే ఘటని
　　　భ స్తన గోవుల మందలే ఒహో
అచ్చర లుండు స్వర్గ మిది
　　　యా యనిపించెడి వింతనేలలే. 2

చూచితి సౌందర్యమ్ముల ,
చూచితి మధురుచులు , తాకి చూచితి కౌనుల్
చూచితి నవవాసన , విని
చూచితి జీవనగళాలు , చోద్యములెన్నో ! 3

"సురజగత్తున ఈ బీరు దొరకబోదు
కాన మనసార త్రాగు డిక్కడనె" యంచు
కొంటెనవ్వుల గుబ్బెతల్ కొసరి కొసరి
అమ్ముదురు బారులను బీరు హైనకీను . 4

పని యొనరించువేళ పొర
　　　పాటున సైతము విశ్రమించ , రా
పని సమయమ్ము తీరగనె
　　　పశుల పోలిక స్వేచ్ఛగా గృహాం
గణములయందునో ప్రియుల
　　　కౌగిళులందునో పానశాలలం
దునసో వినోదమోదముల
　　　లో పులకింతురు కార్యముక్తులై . 5

భగవద్భక్తి కళానురక్తి చిర సౌ
భ్రాతృత్వ సేవా సుధా
పగలే తుంగతరంగ హస్తములు పై
పై కెత్తి గొంతెత్తి మో
దుగవాడుమ్ములు విప్పి ఏవో ఉపదే
శమ్మిచ్చు చున్నట్లు నా
కనిపించెన్ వినిపించె చర్చిగుడి గీ
తాలాపముల్ అచ్చటన్. 6

పిన్నలు పెద్దలు కన్నెలు ప్రౌఢలు
భేదము లెంచక వీధులలో
మన్ను చివుర్చగ మిన్ను గగుర్చగ
మంచు పరాగము నించుకొనన్
వెన్నెల కన్నెలు పాటలు పాడుచు
వెచ్చని నాట్యము లాడిరహో
కన్నుల చూచియు నమ్మము అచ్చటి
"కారినివాలు" మహోత్సవముల్ ! 7

విడి విడి నాట్యముల్ సలిపి
వేసట జెంది, రణించ వాద్యముల్
తడ బడ పాదముల్ ఎదలు
తత్తర మొందగ, నాట్యశాలలం

దొడలు ఒడళ్ళు ఏకముగ
ఒక్కరి నొక్కరు కౌగిలించి ప్రే
ముడి యొనరింపఁగా నటనముల్
యువతీ యువకుల్ ; కనఁవలెన్ ! 8

కాచిన ఎండలో తళుకు
కాంతులు చిందెడి స్వర్ణరాసులో
లేచిన సాగరోర్మికల
లేచిన సుందర రత్నరాసులో
తోచదు, నగ్నగాత్ర నవ
తోరణ పంక్తులు కట్టి సొంపుగా
బీచులు సల్పునేమొ కను
విందుగ గ్రీష్మ మహోత్సవమ్ములన్. 9

ముద్దులుగార, జార జన
మోహన నగ్నవయో విలాసముల్
అద్దపు శాలలం మెరయ,
అత్తరు లత్తుక కాటుకల్ ఎవో
అద్దిన అందముల్ మరుని
అమ్మలుగా అనిసల్పు కామ పుం
విద్దెల వీరవేశ్య లట వింతల
కే గిలగింత లయ్యెడిఁ ! 10

"రంబ్రాంటు'' తైల చిత్రాల శాలలను, "మ
స్థాఖు'' లో కుడ్య చిత్రాలు చూడు
మంచి కంజలిపట్టు కంచు విగ్రహములు
"జగతి న్యాయస్థాన" శాంతిమహాలు
బృందావనమునకే వింటో కుకెన్‌హోపు
యమున బోలిన రైను రమణి చూడు
ఆలమందలు చూడు అభిసారికల చూడు
పాడి పంటలు వన ప్రకృతి చూడు 11

చూడు "రాటరడాము"లో ఓడరేవు,
"స్ఖెవినంగను" లోని విచిత్రములను,
మేడలను చూడు, వజ్రాలవాడ చూడు,
గాలి చక్రాల డైకుల లీల చూడు! 12

ఏగుము ఒక్కసారయిన
హేగు మహానగరమ్ము చూడగా
ఏగుము ఇంద్రభోగముల
నేలెడి ఆంస్టరడాము చూడ, త
త్సాగర తీర రమ్య సుమ
సాగర డోలల తేలిపోవుచున్
సాగుము డచ్చి వీరులు స్వ
శక్తి సృజించిన దేశమున్ కనన్. 13

# నెహ్రూజీ

(27-5-1964 నాటి వేదనాతరంగము)

రాలిపోయెను విశ్వంభరా కిరీట
రమ్య నవ జీవన చ్ఛటా రత్న మొకటి
తడిసిపోయెను మానవతా కవోష్ణ
బాష్పములలోన నేడు నా భరతభూమి. 1

శాంతికి చిహ్నమై భరత
జాతికి జీవన దాతయై జగ
త్క్రాంతికి హేతువై నవ శ
కమ్మును నిల్పిన దివ్యభావనా
స్వాంతుడు ధర్మపాలకుడు
పండిత జవ్హారులాలు—నేడు లో
కాంతర వాసి యయ్యె జగ
మంత విషాద విశీర్ణమయ్యెగా ! 2

భిన్నమత భిన్నభాషా విభిన్న సంస్కృ
తీ నిలయమైన భారతదేశ వాసు
లందరిని ఐక్యపరచు రహస్య బంధ
నముల కనుగొన్న నెహ్రు లేడు మన కింక. 3

సర్వదేశ సమత్వ సహజీవన తటస్థ
నీతి నేర్పిన రాజనీతివేత్త
సకల ప్రజాభ్యుదయకర ప్రణాళికా
సామ్య వాదార్థిక శాస్త్రవేత్త
విమల విశ్వప్రేమ విడని స్వార్థత్యాగ
ధనము పెంచిన పూర్ణతత్వవేత్త
మాన వావళి మనో మౌన వేదనలకు
శాంతి గూర్చిన మనస్తత్వవేత్త 4

పండిత జవాహరుండు ముప్పాతికేళ్ళు
తాను భారత దేశముగాను, భరత
దేశమే తానుగాను వర్ధిల్లిపోయె
నెహూరు ఇహపర పూజనీయ హరిహరుడు. 5

దేశం బంతయు ఆ మహామహుని సం
దేశంబు పాటించి, స్వే
చ్ఛా శాంతి ప్రగతి ప్రదీపన సుదీ
క్షాబద్ధులై నాయకా
ధీశుల్ పాలనసేయునట్లు మము ఓ
దేవా ! కటాక్షించి, పూ
ర్ణాశాభావము , త్యాగ శీలము , సమై
క్య శ్రీలు చేకూర్చుమా ! 6

# మృత్యువు

ప్రాణికోటి వసించు ప్రపంచ జలధి
నెన్నొ కనగాని వలలను పన్ని , జీవు
లను తరతరాలుగా పట్టుకొని భుజించు
చున్న ఓ మృత్యు ! నాకు నీ వన్న భయము . 1

పుట్టెడి ప్రాణుల కొరకై
పుట్టెను ఈ సృష్టి, కాని భువిపై ప్రాణుల్
పుట్టుట గిట్టుట తుది నీ
పొట్టం జేరుటకె! వింత పో విధి కట్టా! 2

ఇల పూచినట్టి జీవులు రాలి నీ కంఠ
హారమ్ము జేర నున్నట్టి పూలె
వసుధ శ్రుతించు జీవ ధ్వనుల్ నీ కాలి
అందెల జేర నున్నట్టి ధ్వనులె
భువి రెక్కలార్చు ప్రాణి విహంగ రాజి నీ
నయనాగ్ని కాల నున్న శలభములె
బ్రతుకుబాటల సాగు ప్రాణులు నీ గర్భ
చితి చేరవచ్చు చున్న తెరువరులె 3

భూ చరమ్ములు, జలచర ఖేచరములు
ధర వయోభేద లింగభేదములు లేక
భవ దనంత క్షుధాగ్ని నార్పగ జగాన
కురియు చిణికపు వాన చినుకు లనిపించు. 4

పాప మంటని పసిపాప లంచు, బ్రతుకు
భారమ్ము తెలియని బాలు రనియు,
వెతలేని యువక దంపతు లని, ప్రణయ వ
ల్లికల పెంచుకొను ప్రేమికు లటంచు,

తలిదండ్రు లని , పోషకు లని , నిర్మలవయో
వృద్ధు లనియు జ్ఞాన వృద్ధు లనియు
నిరుపేద లని , ధనాన్వితు లని , కష్టజీ
వులని , భోగులని , పాపులని గాని 5

ఏ విచక్షణ లేక సుంతేని కరుణ
లేక జీవులను బ్రతుక నీక , ఒకరి
కొకరి నెడబాపి , పొట్ట నింపుకొని మృత్యు
వా ! అవని శోకమయముగా జేయ నేల ? 6

పలు రోగముల రూపములు దాల్చి ఒకసారి ,
అగ్ని ప్రమాదమవై ఒకపుడు ,
పాము కాటుగ , జారుపాటుగా ఒకసారి ,
ఆత్మహత్యా వాంఛవై ఒకపుడు
బాకుపోటుగ , ఏదో బాంబుపాటుగ, భయం
కర యుద్ధరూపిణిగా ఒకపుడు
వరదవై , పిడుగై , తుపానువై , భూకంప
మై , శిలాద్రవరూపివై ఒకపుడు 7

అవతరించి జీవులను స్వాహా యొనర్చ
అటుల జచ్చె ఇటుల చచ్చె నని జనమ్ము
భ్రమల చిక్కి ఏడ్చెదరు ; పబ్బమ్ము నీకు !
కామరూపిణివే మృత్యుకాంత నీవు ! 8

ఒకవేళని ఒక చోటని
ఒక సందర్భమని నియమ మున్నట్టులు లే
దు కదా నీ వేటకు చే
తికి చిక్కిన చాలు నంతె తిని వేతువెగా! 9

సురలు సుధ గ్రోలి నిను జయించిరి స్థిరముగ
జడ జగత్తేమొ నీకు లోబడదు; ఇంక
దొరికెనా ప్రాణికోట్ల ఊపిరులు నీకు
చావు లేదేలనే మృత్యు దేవి నీకు? 10

నిను నిందింతునుగాని, నా ఎడద ప్ర
    శ్నించున్ ధరాకాశ వా
రి నిధుల్ గెల్చుచునున్న మానవుడు గ
    ర్విష్ఠుండు' లోభుండు, హా
యిని కాంక్షించెడి వాడు నీవను భయ
    మ్మే లేనిచో ఈ జగ
మ్మున ఎన్నెన్ని హిరోషిమాలు నరక
    మ్ము ల్నించునో? యంచు నా 11

# యౌవనవీణ

రాలిన పూల తావుల స
    రాగముల౯ స్మరియించుకొంచు, దుః
ఖాలను పొదుకొంచు, నవ
    ఖాండవ సూన సుధాస్రవంతి గా
నాలను బీటువారిన మ
    నమ్ముల పొంరగ నీక; భగ్న లో
కాల సుఖాంత మం చనెడి
    కల్పిత తత్త్వ మసహ్య మయ్యెడిన్. 1

నా నవ యౌవనాంబరము
    న౯ శివమెత్తిన కామ మేఘ రా
గాన సుమించునట్టి అణ
    గారని ప్రేమ తటిల్లతా ద్యుతుల్
ప్రాణసఖిన్ ననున్ ప్రణయ
    బంధమునందున చేర్చి నాకలో
కాను భవమ్ము గూర్చు పరి
    హాసము కామన లేని ప్రేమయా! 2

ఈ వాసంత వసంతికా రవములున్
ఈ శాద్వలీ శోభలున్
ఈ విద్యుల్లతికల్ మహోపవనముల్
ఈ నిర్ఝరుల్ పూర్ణిమల్
దేవీ జీవకళా విలాసములలో
దీపింప లేనప్డు ని
ర్జీవమ్మౌ చను గాన ఈ ప్రకృతిలో
జీవింతు దేవీ హృదిన్ . 3

రెండు గుండెలు ఏకమై యుండుచోట
నేలబడు నిండు దుఃఖ ఘాతాల వేట
రెండు గుండెలె విడిపోయి యుండుచోట
కాలబడు పండు సౌఖ్య పుష్పాలతోట 4

ప్రణయిని సంస్మృతిన్ విరహ
రాగ విపంచికపై నిరాశగా
గొణుగుచు పాడుకొంచు బ్రతు
కున్ బలిచేయను చేతఃగామికిన్
వినిచెద యౌవనాభ్యుదయ
వీణియపైన విశీర్ణలోక వే
దనలకు చైత్రగీతములు ,
తన్వి కవోష్ణ నవోష్ణ పాయినై . 5

# మహోదయము

అదిగో ! ఉదయించె నేడు మహాంధ్రదేశ
ప్రాగ్దిశా తీరమందు ప్రభాకరుండు
కోటి హస్తాలు సాచి ముక్కోటి మేటి
తెలుగులను హత్తుకొనె కవుంగిలిని ఒకట. 1

కృష్ణవేణి గోదావరి కీర్తి వాహి
నులు మహానంద విమల వీచులు నటింప
స్వాగత మ్మిడుచుండె వేవేగ సాగి
ఆ ఉదయభాను మూర్తికి ఐక్యమతికి 2

గతనిశా జీవితాల దుర్గతి సహించి
కఠిన తపమాచరించి నిక్కముగ నేడు
ఈ ప్రభాతాంశువులు సోకగా ప్రఫుల్ల
మయ్యె తెల్గుల హృదయ పద్మాళి శాంతి
సౌఖ్య సుమధురాశాభావ సరసి లోన. 3

ఈ మహోదయ సందీప్తికే మహాత్ము
లెందరో జీవితాల నర్పించినారు,
ఇది మహాంధ్ర భాగ్యోదయ మ్మిది ప్రజా వి
జయ మిది మహాభ్యుదయ రమా జయ విజయము. 4

ఈ యమృతోదయ ప్రభల
    ఈ ఎనలేని మహానుభూతిలో
నీ యెదలోని కల్మషము
    నీటను దోసి, మనోజ్ఞ దివ్య శో
భా యుతమైన ప్రేమ సుమ
    వాటిని నాటుము, తత్కళాత్మక
శ్రీ యుతమౌ సుగంధములు
    చిందగ సర్వదిగంత వీధులన్. 5

సంకుచితత్వము, స్వార్థము
పంకిల రాజకీయములు, వ్యాపారకళల్
శంకత్వము, మౌఢ్యము నే
డింక విడచి, శాంతి సుఖము లేలుద మిటుపై. 6

స్థిర మవును గాక ఆంధ్రప్రదేశ కీర్తి
ఉజ్జ్వల మ్మౌత భారతాభ్యుదయ దీప్తి
శాశ్వత మ్మౌత ఈ విశ్వశాంతి కాంతి
ప్రగతిభానుడు వెల్గుత జగతి నెపుడు, 7
( ఆంధ్రప్రదేశ్ అవతరణ సందర్భంలో చేసిన రచన. )

# ఇతి కర్తవ్యము

మానవు డాత్మ వీడి పర
మాణువు గూడియు, స్వార్థతా సురా
పాన మదాంధుడై తన ప్ర
పంచములో విలయాగ్ని రేపగా
పూనెడి కుట్రలన్ తెలిసి
భూ జనయిత్రి ప్రియాన కన్న సం
తానపు ద్రోహబుద్ధికి మ
నమ్ము విదల్చుక ఏడ్చె నల్లదే! 1

తరతరాలుగ తాను బాధలకు నోర్చి
పెంచి పెద్దచేసియు చదివించి, శక్తి
మంతులను చేసి, ఇకపై సుఖింతు నంచు
ఎంచు ఉర్వర హృది కత్తిరించు నరుడు. 2

ఛీ! దురితాత్మ! గుండెపయి
చే యిడి చెప్పుము మానవా! రణో
న్మాదము మర్త్యరక్త రస
మాంస బుభుక్షలు పొంగులెత్తి నీ
లో దుసిగిల్లలేదె? సుర
లోకము చూపెడి నీ స్వతంత్ర శాం
త్యాది ప్రసంగముల్ విష మ్ము
షాత్మక మైనవి కా దనందువా! 3

అసురుల నేల గూల్చి, కుటి
లాత్ముల ద్రేల్చి, తపించి, ఘోర సా
హసములు చేసి, మానవత
కాయువు పోసి, సుసంస్కృతీ వసం
త సుమ వనమ్ము పెంచిన గ
తమ్మది నీది; స్వ సృష్టి నేడు తా
మసమున బూది సేయుదువె?
మర్కటమానవ! దానవుండవై —! 4

విశ్వసాహిత్యాలు, విసము గ్రక్కెడు నీదు
గుండెలోతుల దూరి మండి పోవు
చిత్రలేఖనము నీ శిశిర తాండవములో
శిథిలరూపముగొని చితికి పోవు

శిల్పమ్ము నీ భయోత్కల్పక యంత్రాల
కాంచి కంపించి వికల్పమొందు
మానవత్వము నీ అమానుషతత్వమ్ము
చెరలో బడి ఉపవసించుచుండె 5

హంతకుడ వని నినుగని 'శాంతి' బెదరి
అడవులంబడి పారిపోయెడిని , జీవ
కోటు లాక్రందనమున సంక్షోభ మంద
ఏమి సాధింతువోయి , నీ వింత చేసి ? 6

యంత్రముల మాయలో చిక్కి ఎంతలోన
మనిషి ! మనిషిని వేటాడ మరగినావు !
పశుబలపతాక లేపు నీ ప్రజ్ఞ చూచి
పరిహసించు నో రెరుగని ప్రాణు లవియు . 7

ఇలపైనున్న సమస్తముఁ గెలిచి నీ
విన్నాళ్ళుగా బుద్ధి శ
క్తులచే కాంచిన దివ్య భాగ్యముల నీ
దుర్మార్గముఁ వీడి ఉ
జ్జ్వల సౌభ్రాత్రము సౌమ్యమున్ వెలుగ వి
శ్వమ్మంతటన్ పంచి , శాం
తి లతల్ పెంచుము , ప్రేమజీవనములన్ ;
దీవించు నిన్ సృష్టియున్ . 8

# సుభాసు వాణి

చచ్చితి నంచు కొందరును
        చావగలే దని కొంద రెప్పుడో
వచ్చు నటంచు కొంద ;  రెటు
        వచ్చును చచ్చిన నంచు ఊహకున్
వచ్చినరీతి ఎవ్వరికి
        వారు తలంతురు ; నాకు అందరున్
నచ్చినవారె యౌట , పడి
        నాను విచిత్ర వివాద నీరధీ.    1

చచ్చితినొ లేదొ ,  నేనే
ఖచ్చితముగ చెప్పలేను , కడలి కడుపులో
చొచ్చిన సూర్యుడు చచ్చునె ?
చచ్చునె తమసాబ్ధి మున్గు చంద్రుడు చెపుమా !    2

చచ్చితి నందునా స్వాతంత్ర్య వీర జీ
వన భావనలలోన బ్రతికియుంటి
బ్రతికితి నందునా పారతంత్ర్యము పీల్చు
పచ్చినెత్తుటపడి చచ్చియుంటి
చచ్చితి నందునా స్వారాజ్యలక్ష్మి భా
రత సౌధ కుడ్యాల బ్రతికియుంటి
బ్రతికితి నందునా స్వార్థ సంకుచిత దం
ష్ట్రిల చిక్కి ముక్కలై చచ్చియుంటి 3

చచ్చితినె, లేదు బ్రతికిన జాడ గలదు
బ్రతికితినె, లేదు చచ్చిన వార్త గలదు
బ్రతికి చచ్చిన వీర సుభాసు నేను
చచ్చి బ్రతికిన జీవనాశయము నేను— 4

ఎవరికి చెప్పకుండ భర
తేందిర బంధవిమోచనార్థమై
అవలికి పోయినాను, అసు
రాయుధశక్తి నహింసతో జయిం
చ వశము కాదు కాదని స
శస్త్రుడనై భరతోర్వి శత్రు శ
త్రువులను కూడినాను, జయ
తోరణముల్ రణమందు కట్టితిన్. 5

శోక తిమిరము తొలగించు జ్యోతికొరకు
వదలినటు బుద్ధుడు కపిలవస్తు పురము
దాటిపోయితి దాస్య కవాటములను
తిరిగి రానెంచి స్వాతంత్ర్య తరణితోడ. 6

తమ మాటల్ విననాడ కాదని——అస
త్యమ్మేమొ సత్యాన, ద్వే
షమునో రాగముతోడ గెల్చుట కహిం
సా శాంతి మార్గాననే
తమ వెంటన్ చననాడ కాదని——మహా
త్మా గాంధి నెహ్రూజి స్వాం
తములం దెంతయు కుందియున్ అనరె నే
తాజీ భలే యంచు నన్ ! 7

పారతంత్ర్య తమస్సు పౌరుష ఖడ్గ ధా
రారుణ ప్రభల చెండాడునట్టి
ఉన్మత్త మత్త మహోగ్ర సామ్రాజ్య వా
దాసుర మకుట మడంచునట్టి
కులమత జాతి సంకుచితత్వ దుర్గాల
చీల్చి మానవుని రక్షించునట్టి
మలయా హిమాలయ వలయాన గ్రుంకబో
నన్న సూర్యుని చెరగొన్న యట్టి 8

దేశ భక్తోష్ణరక్త ప్రవాస ధార
తీయ రణ వీణ ఆజాదు హిందు సేన ,
నాకు తొలిసారి ప్రాగ్దిశా వాటిలో త్రి
వర్ణ కేతన వల్లి గర్వాల వెల్లి! 9

స్వాతంత్ర్య సమరాన సాగిపోవుట తప్ప
స్వార్థచింతనము విశ్రాంతి లేని
ఆదర్శ సిద్ధికై త్యాగధనము తప్ప
లఘుపథార్జిత ధనలక్ష్మి లేని
జైహిందు జైజై విజయగర్జనలు తప్ప
అంతః కలహం భవు భౌలు లేని
ఆగ్రహాసత్యాగ్రహాస్త్ర ధారులు తప్ప
పనికి మాలిన పిర్కి పందలేని 10

రోజు లవి , జీవితాలె కర్పూర మట్లు
కరిగి , గిరినిభ దాస్య పంకమును కడిగి
వేయు ఆ రోజులు స్మరించు నా యెడంద
పొంగిపోవు హిమాలయ శృంగ మట్లు. 11

స్వాతంత్ర్యోదయ మయ్యె భారత జన
స్వప్నాలు పండెన్ , అహో
నేతాజీ కనరా డదేమి ? తన సం
దేశమ్ము విన్పింప డే

లా ? తారాపథ చుంబి కీర్తిమయు డే
లా? చంద్రుడేలా ? జగ
న్మాతృశ్రీ నయ నోత్పలమ్ములకు ఆ
నందమ్ము కల్పింపడో ? 12

అని జనవాణి ప్రియమ్మున
నను తలచి నుతించె, లోకనాకము లొకసై
నను ముంచెను తాదాత్మ్య
మ్మున జీవన్మరణ రహిత మోక్షస్థితిలో . 13

బాపూజీ బలి యయ్యె దుర్మత తమో
వ్యాళోగ్రవాహాగ్నికిన్ ,
ఆపై దీపము ఆరిపోవునటు స
ర్దారుండు కన్మూసె , ఇం
కా పై రాలె ననేక తారకలు జ
హ్వార్లాలు శాస్త్రీజి , దు
ష్ప్రాపట్య క్షతగాత్రు లైరి భరత
క్ష్మామాత దౌర్భాగ్యమో ! 14

మనుషులు మహాత్ములెందరు మరుగుపడిన
మరుగు పడరాదు స్వాతంత్ర్య తరణి దీప్తి
చితికి పోరాదు ఏ పరిస్థితుల నైన
మీ మనోగత మానవతా మతల్లి . 15

# నివేదన

ఉన్నావో లేవో ఎట
నున్నావో తెలియకున్నదోయి మహేశా !
నన్నేల సృజించితివో
ఇన్నిన్ని అయోమయాల ఇడుమల మధ్యన్. 1

భయ శంకలు, బాధలు, వి
స్మయములు నన్నావరించి మరి మరి వేచున్
లయ తప్పిన శ్రుతి యయ్యెను
క్రయ విక్రయ వీధి యయ్యెగా నా బ్రతుకే ! 2

ఎక్కడనో గల తారలు
ఇక్కడ పడియున్న నన్ను ఏడ్పించునురా !
ప్రక్కన గల చిరుగాలులు
మక్కువతో అనునయంపు మాటలు చెప్పున్. 3

రక రకముల గొంతులు నను
చక చక రమ్మంచు దశ దిశలలో పిల్చున్
చకితుడనై ఎటు తోచక
అకటా! ఎట నుండినావొ అటనే ఉంటిన్ ! 4

నా ఎదలో శివ మెత్తిన
మాయల ఊహములు మంచుమల కొమ్ములపై
ఊయల లూచుచునే పడ
దోయును నను లోయలను అధోలోకములన్. 5

తమసమ్ముల కనగానే
హిమమై పోవుదును శక్తిహీనుడ నౌదున్
కమలాప్త దీప్తి కనగనె
అమితావేశాగ్ని శిఖల కాహుతి యగుదున్ . 6

తెలిమబ్బుల మైదాన
మ్ముల జాబిలి బంతి యాడ బోయి , నిరాశా
జలధి హృదంతర మౌక్తిక
ముల రత్నము లేరు కొనగ ముచ్చట పడుదున్. 7

అర్థము వెంట ఒకపుడు, ప
దార్థ జ్ఞానమ్ముకోసమై మరొకపుడున్
స్వార్థమ్ముల వెంటను, పర
మార్థమ్ముల వెంట బడి నిరర్థకు నైతిన్. 8

మారుతమువోలె నా ఊ
హా రుతములు నిల్వలేవయా ఒకచోటన్
నీరదము వోలె నా ఎద
మారుచునే ఉండు ఏది మార్గమ్మొ? ప్రభూ! 9

నా కనుల భ్రాంతి కొల్పెడి
చీకటి తెరలేవొ కలవు చిక్కవు నాకున్
లేకుండిన అడుగడుగున్
నాకెందుకు ఇన్ని మాయ నాగులు తగులున్. 10

ఆది తుది లేని సృష్టికి
కాదని ఔనంచు నీవె కారణ; మెంతన్
వాదించ వివాదించిన
లేదు సమాధాన మెరుగలేరు నిజమ్మున్. 11

నా క్షుభితమైన మేధకు
ఏ క్షణమున శాంతిలేదు ఈ చీకటిలో
చక్షువు నాకీవే, పరి
రక్షణ మీవేను చూపరా వెల్గు! ప్రభూ! 12

# చంద్ర విజయము

ఘన ఘనాపూర్వ విజ్ఞాన కవచ ధారి
భావ నాతీత పృధు రోదసీ విహారి
రాగ మసృణ విశ్వంభర రాయబారి
అడుగు పెట్టెను చంద్రలో కాంగణాన--- 1

తన నిర్జీవాంకము విడి
చనె జాబిలి యంచు వగచు జగ దంబకు నే
డైన లేని పండు గయ్యేను
మనుజుడు భూమాత చంద్రమాతను కలిపెన్. 2

ఇతిహాస స్థ పురాణ వేద గత మౌ
నీంద్ర శ్రుతి శిక్ష యో
గ తపోంతర్గత సృష్టి జీవన రహో
గాథల్ ఎవో భావనా
లతలో స్వప్నములో విముగ్ధ మధురా
లాపమ్ములో గాక, భా
వి తమః క్షేత్ర సుషుప్త వాస్తవికతా
బీజమ్ము లై లేచెడిన్. 3

చెరగని ఆత్మజ్ఞానము
తరగని మేధా జనిత పదార్థ జ్ఞాన
మ్మిరు కడల వెడలి కలిసెను
పరిణామ ద్వంద్వ ప్రకృతి పథ మేళనమై. 4

భూమి జయించె మానవుడు,
భూరి పయోనిధులన్ జయించెగా;
వ్యోమముకూడ నే డసదృ
శోద్గమ మందు జయించి మించె, ఇం
కేమిటి, భావి జీవన గ
తీందిర లక్షిత లక్ష్య మేమిటో?
ఏమిటి ఏమి టంచు నిన
దించె నవే చకితాంతరాళముల్. 5

కరువులు కాటకాల్ బ్రతుకు
కష్టము లన్నియు తీర్చుకొంటకై
వరము లభించెనా, పరుల
భాగ్యముకోసము నేలకోసమున్
జరిపెడి యుద్ధ తంత్రముల
జాడలు గోడులు మాసి పోయెనా,
ధరణికి స్వర్గ సీమకును
దవ్వు కడుంగడు తీరిపోయెనా! 6

తన కుటుంబపు గొప్పతనముకై ఊరెల్ల
'తగలెట్టు' సంకుచితత్వ నీతి
తన ఊరుపేరుకై తన రాష్ట్ర మంతకు
గరళమ్ము పెట్టు మూర్ఖత్వ నీతి
తన రాష్ట్ర ఘనతకై తన దేశవృద్ధిని
భంగపరచెడి దానవత్వ నీతి
తన దేశ యశమున కితరదేశముల బలి
దానము గొను మనస్తత్వ నీతి 7

మానవు డజేయు డికపైన మాను కొనునొ
లేక, తనలోకమైన భూలోక కీర్తి
సాధనకు సర్వ లోకాల శాంతి సుఖము.
చెరగొనునొ, స్వార్థ లోభాలచేత జిక్కి. 8

# కళాతృష్ణ

అందము అందమే మనకు
        అందిన అందకపోయినన్ ; మన
స్పందన వేరు తార్కిక వి
        వాదము వే ; రవి రెండు భావనా
నంద నదీ తటద్వయము
        నా విలసిల్లును ; ఇంద్రి యానుభూ
తీందిర పేదవోదు పడ
        గెత్తిన ధీ బలశాస్త్ర మెంతయున్. 1

రాలును రవ్వలున్ పనికి
    రానివి కొండలు గోతులున్ వినా
గాలియు నీరు లేని ఎడొ
    గందర గోళము చంద్రగోళ మం
దాలకు ప్రోవు గాదనుచు
    అద్భుత చిత్రము లెన్ని చూపినన్
రేల నభోంతరాల శశి
    రేఖల చూచి చలింప కుందుమా! 2

ఎముకల గూడు, నాడులకు
    ఇల్లకళంక కళంక రక్త నా
ళముల సమూహమున్, పలల
    రాశి, కళాసపుత్తియేను, దే
హమని ఎరుంగు వైద్యునకు
    అందము చందము కానుపించదా!
రమణుల చూచినప్పుడు స
    రాగ పరాగము పొంగు లెత్తదా! 3

మబ్బులందు పైనించి విమాన మందు,
ఏమి గలదిందులో ధూళి ధూమ మనుచు
అను కొనుచు నేలపై దిగి, అంబరాల
తేలు జలదాల అందాల తేలిపోమె? 4

బాధ పడెడువారు, బాధించు వారును
పట్టి అభినయించు వారె యంను
తెలిసి కూడ వెండి తెర మీద దృశ్యాలు
కాంచి కంటనీరు నించు కొనమె ? 5

పుట్టినది గిట్టు బ్రతుకు బుద్బుదమె యంచు
ఎరిగియుఁ నరులు చావు పేరెరుగ నట్లు
ప్రాకు లాడరె యశము ప్రాభవము కొరకు
వాస్తవము కన్న బ్రతుకున భ్రాంతి మిన్న 6

చంద్ర విజయమ్ము, విజ్ఞాన శాస్త్ర జృంభ
ణమ్ము, ఊహా జనిత కవనమ్ములకును
కళలకు విఘాతమనెడి సుద్దులవి మిథ్య
శాశ్వతము కళాతృష్ణ ఆ జాబిలి వలె . 7

V.R. NARLA MEMORIAL LIBRARY ★
V.R.NARLA
D. P. R. I.
Acc. No.
13C I

Acc/A10113107

BAPUREDDY PADYAKAVYALU

By **J. Bapu Reddy**

BC SUKHELA PUBLICATION

HYDERABAD-4-

మనసు ఫౌండేషన్ పుస్తకాల పరిశీలనాపట్టిక

| | |
|---|---|
| పుస్తకం సంఖ్య | AOUA101B107 |
| పుస్తకం పేరు | బాపురెడ్డి పద్యకావ్యాలు |
| తారీఖు | 31 December 2025 |
| ముందు అట్ట | Yes |
| వెనుక అట్ట | Yes |
| మొత్తం పేజీలు | 101 [illegible] |
| పెద్ద సైజు పేజీలు | NO |
| ఖాళీ పేజీలు | [illegible] |
| లేని పేజీలు | NO |
| తయారు చేసినది | P Jayamma |
| పేజీలు విడదీసినది | P Jayamma |
| స్కాన్ చేసినది | [illegible] |
| పరీక్ష చేసినది | MADHU MATHI |
| పేజీలు సరిచూసినది | |
| బైండింగు చేసినది | |
| [illegible]ింగు చేసినది | |
| | [illegible] |